# విశాల భారతి

20-02-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 49


## గంజాయి చాక్లెట్లతో స్పెషల్ పాలు

- బేగంబజార్‌లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న గంజాయి చాక్లెట్ల విక్రయం
- పాలల్లో గంజాయి పొడిని కలిపి వింత పానీయంగా విక్రయిస్తున్న ముఠా
- నార్కోటిక్ బ్యూరో అధికారుల ఆకస్మిక దాడుల్లో బయటపడ్డ విస్తుపోయే నిజాలు
- నిందితుల నుంచి భారీగా గంజాయి కలిపిన చాక్లెట్లు, నగదు స్వాధీనం
- యువత, విద్యార్థులే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రమాదకరమైన మత్తు దందా
- నగరవ్యాప్తంగా నిఘా పెంచిన పోలీసులు.. నిందితులపై కఠిన చర్యలకు ఆదేశం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భాగ్యనగరంలో మత్తు రక్కసి తన రూపు మార్చుకుంటోంది. ఇప్పటి వరకు పొగ రూపంలోనో, పౌడర్ రూపంలోనో దర్శనమిచ్చిన గంజాయి, ఇప్పుడు ఏకంగా తినుబండారాలు, పానీయాల్లోకి ప్రవేశించింది. ముఖ్యంగా వ్యాపార కూడలిగా పేరుగాంచిన బేగంబజార్ ప్రాంతంలో గంజాయిని చాక్లెట్ల రూపంలో మార్చి విక్రయిస్తున్న వైనం వెలుగులోకి రావడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. చిన్నారులు, యువత అమాయకత్వంతో వీటిని కొనుగోలు చేసి మత్తుకు బానిసలవుతున్నారన్న సమాచారంతో రాష్ట్ర నార్కోటిక్ బ్యూరో అధికారులు రంగంలోకి దిగారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన దాడుల్లో నగరంలో సాగుతున్న ఈ ప్రమాదకరమైన దందా గుట్టు రట్టయింది. ఈ ముఠా అనుసరిస్తున్న తీరు పోలీసులను సైతం విస్మయానికి గురిచేసింది. కేవలం చాక్లెట్ల రూపంలోనే కాకుండా, సాధారణంగా తాగే పాలల్లో గంజాయి పొడిని కలిపి ప్రత్యేక పానీయంగా విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు రద్దీగా ఉండే ప్రాంతాలను ఎంచుకుని, పాలు లేదా ఇతర తినుబండారాల ముసుగులో ఈ విషాన్ని చిమ్ముతున్నారు. పాలు ఆరోగ్యానికి మంచిదని తాగే వారు, తెలియకుండానే ఈ మత్తులో చిక్కుకుపోతున్నారు. ముఖ్యంగా తక్కువ ధరకే మత్తు వస్తుండటంతో కూలీలు, విద్యార్థులు ఈ ఉచ్చులో పడుతున్నట్లు దర్యాప్తులో తేలింది.

మిగతా 2లో..

## 'బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరూ కాపాడలేరు'

- పోలీసులకు మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర హెచ్చరిక
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే లెక్కలు తేలుస్తామన్నారు
- చట్టం ప్రకారం కాకుండా అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారని ఆరోపణ
- ఖమ్మం జిల్లాలో కార్యకర్తలపై దాడులను ఖండించిన మాజీ మంత్రి
- తప్పుడు కేసులు పెడితే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సిందేనని స్పష్టం
- కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా

03



## ఈ నెల 25 నుంచి ఇంటర్ పరీక్షలు

- ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర హాల్ టికెట్లు విడుదలయ్యాయి
- ఫిబ్రవరి 25 నుంచి ప్రథమ సంవత్సరం, 26 నుంచి ద్వితీయ సంవత్సర పరీక్షలు
- పరీక్షా కేంద్రాలను సులభంగా గుర్తించేందుకు హాల్‌టికెట్లపై ప్రత్యేక క్యూఆర్ కోడ్
- విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు వాట్సాప్ ద్వారా నేరుగా డౌన్‌లోడ్ లింకులు
- అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా హాల్ టికెట్లు పొందే వెసులుబాటు
- సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు

02






## మళ్లీ అధికారం మాదే

- మార్చి 15లోగా నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తి
- కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం: మహేష్ కుమార్ గౌడ్
- ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ అగ్రనేతలతో కీలక భేటీలు
- * సామాజిక సమీకరణాలు, ప్రాంతాల వారీగా పదవుల పంపకం
- మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్‌తో ప్రాథమిక చర్చలు
- పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించిన టీపీసీసీ

02

# మనం ఏఐని శాసించాలి

## మానవ వికాసంలో కృత్రిమ మేధది కీలక పాత్ర

## సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో భారత్ ముందంజ

ఏఐ దుర్వినియోగం కాకుండా 'మానవ్' విజన్ అవసరం

- ఏఐ వ్యవస్థలు పారదర్శకంగా, జవాబుదారీగా ఉండాలి
- సమాచార సార్వభౌమత్వం , దేశ భద్రత అత్యంత ముఖ్యం
- గుత్తాధిపత్యం లేకుండా అందరికీ ఏఐ అందుబాటులోకి రావాలి

03




కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యం ప్రస్తుతం మానవ మేధస్సు అంచనాలకు అందనంత వేగంతో దూసుకుపోతోందని, దీనిని నియంత్రించే శక్తి కూడా మన చేతుల్లోనే ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం ఘనంగా ప్రారంభమైన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏఐ వినియోగం కేవలం సాంకేతిక పురోగతికే పరిమితం కాకుండా, అది చట్టబద్ధంగా, నిరంతరం పునఃసమీక్షించేలా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మానవాళి అభివృద్ధి ప్రస్థానంలో కృత్రిమ మేధ ఒక విప్లవాత్మక మార్పును తీసుకువస్తోందని, దీనిని సరైన దిశలో నడిపించడం ప్రపంచ దేశాల బాధ్యత అని మోదీ గుర్తుచేశారు.

## 8 మంది అవినీతి ఇంజినీర్లపై వేటు




- టీజీఎస్పీడీసీఎల్‌లో ఒకేసారి ఎనిమిది మంది అధికారుల సస్పెన్షన్
- కొత్త కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో అక్రమాల పర్వం
- ఫోన్ పే, డిజిటల్ మాధ్యమాల ద్వారా యథేచ్ఛగా లంచాల స్వీకరణ
- యాంటీ బ్రైబరీ సెల్ ఫిర్యాదులతో కదిలిన ఇంటెలిజెన్స్ యంత్రాంగం
- క్షేత్రస్థాయిలో ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజినీర్లపై ప్రభుత్వం చర్యలు
- అవినీతి రహిత పాలనే లక్ష్యమన్న ఉన్నతాధికారుల హెచ్చరిక

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో అవినీతి తిమింగలాల వేట మొదలైంది. ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా విద్యుత్ శాఖలో తిష్టవేసిన అక్రమార్కులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తూ ఒకేసారి ఎనిమిది మంది ఇంజినీరింగ్ అధికారులను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విప్లవాత్మక చర్యతో విద్యుత్ శాఖలోని ఇతర విభాగాల్లోనూ ఒక్కసారిగా కలకలం రేగింది. సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, అక్రమ సంపాదనకు అలవాటు పడిన

మిగతా 4లో..

## ఉచిత పథకాలపై సుప్రీం సీరియస్

- ఓట్ల వేటలో ఉచితాల పంపిణీపై ధర్మాసనం ఆగ్రహం
- ఆదాయమంతా జీతాలు, ఉచితాలకే సరిపోతోందని ఆక్షేపణ
- ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా విద్యుత్ ఇవ్వడంపై ప్రశ్నలు
- రాష్ట్రాల అభివృద్ధికి ఉచితాలు పెను విఘాతమని విశ్లేషణ
- ఉచితాల కంటే ఉపాధి కల్పనకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు.. నాలుగు వారాల్లోగా బదులివ్వాలని ఆదేశం

03



## మంత్రుల అవినీతి చిట్టా విప్పుతాం

- త్వరలోనే మంత్రుల అవినీతి చిట్టా బయటపెడతామన్న బండి సంజయ్
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలను వంచిస్తోందని విమర్శ
- మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లు కూల్చడం అమానుషమని ధ్వజం
- హైడ్రా పేరుతో సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపాటు
- రైతు భరోసా, రుణమాఫీ అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపణ
- ప్రజా సమస్యలపై భాజపా రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టీకరణ

03



## సిద్దిపేట నుంచి పోటీకి సై!



- మే మొదటి వారంలో కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ ప్రకటన
- వ్యక్తుల కంటే వ్యవస్థలకే పెద్దపీట వేస్తామన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట లేదా బోధన్ నుంచి పోటీకి మొగ్గు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ఎదిగి అధికారంలోకి వస్తామన్న ధీమా
- స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని వెల్లడి
- తెలంగాణ వాదమే పునాదిగా కొత్త తరం నాయకత్వానికి అవకాశం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన ఆమె, అనంతరం తన ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి జాగృతి వేదికగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కవిత, తాజాగా తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టతనిచ్చారు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మే మొదటి వారంలో కొత్త పార్టీని ప్రకటించబోతున్నట్లు ఆమె వెల్లడించారు. తమ పార్టీ ఏ ఒక్క వ్యక్తి చుట్టూ తిరగదని, వ్యవస్థల ఆధారంగా నడుస్తుందని కవిత స్పష్టం చేశారు. సాధారణంగా ప్రాంతీయ పార్టీలు నేతల చుట్టూ కేంద్రీకృతమై ఉంటాయని, కానీ తాము ఒక బలమైన సైద్ధాంతిక పునాదిని నిర్మించి, వ్యవస్థాగతమైన మార్పును తీసుకొస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ శూన్యతను భర్తీ చేసి, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడమే తమ లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నిర్మాణంలో కొత్త తరానికి, యువతకు పెద్దపీట వేస్తామని, ఎన్టీఆర్ హయాంలో సామాన్యులు కూడా ఉన్నత పదవులు చేపట్టిన తరహాలో తమ పార్టీలో అవకాశాలు ఉంటాయని వివరించారు.

మిగతా 2లో..

# మళ్లీ అధికారం మాదే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. వచ్చే నెల మార్చి 15వ తేదీలోగా అర్హులైన నాయకులు, కార్యకర్తలకు పదవులు కట్టబెట్టనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. హస్తిన పర్యటనలో ఉన్న ఆయన, ఏఐసీసీ ముఖ్య నేతలతో భేటీ అనంతరం ఈ కీలక ప్రకటన చేశారు. పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి, పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్త శ్రమను ప్రభుత్వం గుర్తిస్తుందని, అధికారంలో భాగస్వాములను చేయడం ద్వారా వారికి తగిన గౌరవం కల్పిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు నామినేటెడ్ పదవుల భర్తీని ఒక సాధనంగా అధిష్టానం భావిస్తోంది. ఇప్పటికే మొదటి విడతలో కొన్ని కీలక కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించినప్పటికీ, ఇంకా వందలాది పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ క్రమంలో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ బోర్డులు, కమిటీల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు కసరత్తు తుది దశకు చేరుకుంది. సామాజిక సమీకరణాలను తూచ తప్పకుండా పాటిస్తూ, పార్టీకి విధేయులుగా ఉన్న వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహేష్ గౌడ్ సంయుక్తంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటనలో భాగంగా మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సహా ఇతర అగ్రనేతలను కలిసి రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై నివేదిక సమర్పించారు. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల విషయంలో పెండింగ్‌లో ఉన్న జాబితాను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే సరిదిద్దుకుని, మార్చి రెండో వారానికల్లా అధికారిక ఉత్తర్వులు వెలువడేలా చర్యలు తీసుకోవాలని హైకమాండ్ దిశానిర్దేశం చేసింది. పదవుల పంపకంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేయాలని, బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యత పెంచాలని అధిష్టానం సూచించినట్లు సమాచారం.

మరోవైపు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై కూడా రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేయడం ద్వారా పాలనలో మరింత వేగం పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశంపై కూడా మహేష్ గౌడ్ ఢిల్లీ వేదికగా ప్రాథమిక చర్చలు జరిపారు. అయితే, ప్రస్తుతానికి నామినేటెడ్ పదవుల భర్తీపైనే ప్రధాన దృష్టి సారించామని, ఇది పూర్తయిన వెంటనే మంత్రివర్గ విస్తరణపై స్పష్టత వస్తుందని ఆయన పేర్కొన్నారు. అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం లభించేలా, సమర్థులైన వారికే కేబినెట్ లో చోటు దక్కుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలు శ్రమించిన ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని విస్మరించబోమని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వ వేధింపులను తట్టుకుని, కేసులు ఎదుర్కొని నిలబడిన కార్యకర్తలకు న్యాయం చేయడం తమ బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. కేవలం పైస్థాయి నాయకులకే కాకుండా, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసిన వారికి కూడా మార్కెట్ కమిటీలు, ఇతర స్థానిక సంస్థల్లో పదవులు దక్కనున్నాయి. దీనివల్ల వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మరింత పుంజుకుంటుందని అధిష్టానం ఆశిస్తోంది.

ఈ పర్యటనలో పార్టీ సంస్థాగత మార్పులపై కూడా దృష్టి సారించారు. త్వరలోనే జిల్లా కాంగ్రెస్ కమిటీల (డీసీసీ) పునర్వ్యవస్థీకరణ ఉంటుందని, పనితీరు ఆధారంగానే నాయకులకు పదోన్నతులు కల్పిస్తామని మహేష్‌గౌడ్ వెల్లడించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ యంత్రాంగం చురుగ్గా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం దెబ్బతినకుండా ఉండేందుకు ప్రతి నెల ఒక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. నామినేటెడ్ పదవుల భర్తీలో మహిళలకు కూడా భారీగా అవకాశం కల్పించబోతున్నట్లు సమాచారం. మహిళా సాధికారతకు పెద్దపీట వేసే కాంగ్రెస్ సిద్ధాంతానికి అనుగుణంగా, వివిధ కార్పొరేషన్లలో మహిళా నాయకులకు ప్రాతినిధ్యం కల్పించనున్నారు. అలాగే విద్యార్థి విభాగం (ఎన్ఎస్‌యూఐ), యువజన కాంగ్రెస్ (యూత్ కాంగ్రెస్)లో చురుగ్గా పనిచేసిన యువ నాయకులకు కూడా ఈసారి జాబితాలో చోటు దక్కే అవకాశం ఉంది. తద్వారా పార్టీలో కొత్త రక్తాన్ని ఎక్కించి, భవిష్యత్తు నాయకత్వాన్ని తయారు చేయాలని హైకమాండ్ యోచిస్తోంది. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేలా పాలన సాగిస్తున్నామని, ఆరు గ్యారంటీల అమలులో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మహేష్‌గౌడ్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. నామినేటెడ్ పదవుల భర్తీ ద్వారా పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుందని, తద్వారా ప్రజా సమస్యల పరిష్కారం మరింత సులభతరం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేసి ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన వెంటనే మహేష్ గౌడ్ ముఖ్యమంత్రితో భేటీ కానున్నారు. అధిష్టానం సూచించిన మార్పుల మేరకు తుది జాబితాను సిద్ధం చేసి, గవర్నర్ ఆమోదానికి పంపే ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. మార్చి 15 గడువు సమీపిస్తుండటంతో ఆశావాహుల సంఖ్య కూడా పెరిగింది. గాంధీ భవన్ చుట్టూ నాయకుల సందడి నెలకొంది. తమకు కూడా ఏదో ఒక కార్పొరేషన్ లో అవకాశం దక్కుతుందని ఆశగా ఎదురుచూస్తున్న పాత తరం నాయకులు కూడా తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మొత్తానికి, తెలంగాణ కాంగ్రెస్ లో నామినేటెడ్ పదవుల కోలాహలం మొదలైంది. మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించిన గడువులోగా పదవుల భర్తీ పూర్తయితే, పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం రావడం ఖాయం. అటు పాలనలో, ఇటు పార్టీలో సమతుల్యత పాటిస్తూ ముందుకు సాగాలని చూస్తున్న కాంగ్రెస్ కు ఇది ఒక అగ్నిపరీక్ష లాంటిదే. కార్యకర్తల ఆకాంక్షలు నెరవేరుతాయా లేదా అన్నది మార్చి రెండో వారంలో వెలువడే జీవోలతో స్పష్టం కానుంది.

## నిర్ధవెల్లి గ్రామ ఉప సర్పంచ్ సఫూరా ఆమేర్ ఓదార్యం

**సొంత ఖర్చులతో వార్డులో ఎల్ఈడి లైట్లు ఏర్పాటు**



**కేశంపేట, విశాలభారతి:** మండల పరిధిలోని నిర్ధవెల్లి గ్రామంలో గురువారం నాల్గవ వార్డులో గ్రామ ఉపసర్పంచ్ సఫూరా ఆమేర్ సొంత ఖర్చులతో ఎల్ ఈడి లైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో విద్యుత్ లైట్లు లేక ప్రజలు రాత్రి సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి ఇబ్బందులను దూరం చేసేందుకే తాము సొంత ఖర్చులతో లైట్లు వేయించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావిస్తూ పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసిన ఉపసర్పంచ్ సఫూరా ఆమేర్ కు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు చంద్రయ్య, నాయకులు బద్రూద్దీన్ , హుసేన్, సిరాజుద్దీన్, నసీరుద్దీన్, ఆజాహర్, షాబొద్దిన్, నరసింహచారి, గయజ్ పంచాయతీ సిబ్బంది బత్తుల శేఖర్ , జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## వంతెన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**మణుగూరు, విశాలభారతి :** మండలంలోని రామానుజవరం నుండి కొత్త మల్లేపల్లి గ్రామానికి వెళ్లే మార్గమధ్యంలో వాగుపై సుమారు ₹ 2 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న వంతెన పనులను గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వంతెన నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించారు. పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణంలో ఎటువంటి లోపాలు లేకుండా, వంతెన బలంగా మరియు దీర్ఘకాలం నిలిచేలా నిర్మించాలని సూచించారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల మధ్య రాకపోకలకు ఈ వంతెన ఎంతో కీలకమని పేర్కొంటూ, నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు పనులను వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్ , గుండగాని నాగేశ్వరావు , తమ్మిశెట్టి సాంబశివరావు , సాదిని సీతయ్య , కృష్ణరావు , కేతినేని రాజేష్, రాసాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# సిద్దిపేట నుంచి పోటీకి సై!

**మొదటిపేజీ తరువాయి**

రానున్న ఎన్నికల్లో తాను ఎక్కడి నుంచి పోటీ చేయబోతున్నారనే విషయంపై కూడా కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన మొదటి ప్రాధాన్యత సిద్దిపేట నియోజకవర్గమేనని, రెండో ఛాయిస్‌గా బోధన్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నానని వెల్లడించారు. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిన సిద్దిపేటను తన అరంగేట్రం కోసం ఎంచుకోవడం వెనుక ఉన్న వ్యూహంపై విశ్లేషణలు మొదలయ్యాయి. నియోజకవర్గ ప్రజలతో ఉన్న అనుబంధం, స్థానిక సమస్యలపై ఉన్న అవగాహన తనను విజయం వైపు నడిపిస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పాలన విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాత బీఆర్ఎస్ అడుగుజాడల్లోనే నడుస్తోందని, కొత్త తరహా రాజకీయం ఎక్కడా కనిపించడం లేదని ఆక్షేపించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను గత ప్రభుత్వం గాలికొదిలేసిందని, దానివల్ల కార్మికుల్లో తీవ్ర ఆగ్రహం ఉందన్నారు. బిల్లుల చెల్లింపుల విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ పాలన కంటే గత ప్రభుత్వమే నయం అనే పరిస్థితి నెలకొందని విమర్శించారు. రెండేళ్లు గడుస్తున్నా ఆర్టీసీలో ఒక్క పర్మినెంట్ రిక్రూట్‌మెంట్ కూడా చేపట్టలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికిపై ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీకి స్థానం ఉండదని, ప్రధాన ప్రతిపక్షంగా తమ పార్టీయే అవతరిస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ వాదమే తమ పార్టీకి ప్రధాన బలం అని, ఆ ఆకాంక్షల ప్రకారమే ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు. ప్రయారిటీల ఆధారంగా ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తామని హామీ ఇచ్చారు.



కేవలం అసెంబ్లీ ఎన్నికలకే పరిమితం కాకుండా, రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ తమ పార్టీ అభ్యర్థులను నిలుపుతామని ప్రకటించారు. మహిళా నాయకత్వంపై సమాజంలో ఉన్న వివక్షను ఆమె ఎండగట్టారు. "నేను ఆడదాన్నే కదా అని తక్కువ అంచనా వేయవద్దు.. అవమానించవద్దు" అంటూ గట్టిగా చెప్పారు. ఒక మహిళగా పార్టీ పెట్టడం, దానిని నడపడం సవాలుతో కూడుకున్నదైనా, ప్రజా మద్దతుతో అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తానని పేర్కొన్నారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడాన్ని ఇక్కడి ప్రజలు ఆమోదించలేదని, ఆమె ఇప్పుడు ఏపీలో జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారని గుర్తు చేశారు. గతంలో చిరంజీవి వంటి దిగ్గజాలు పార్టీ పెట్టి మూసివేసిన ఉదాహరణలను ప్రస్తావిస్తూ, ఎవరి దారి వారిదేనని, తన ప్రయత్నం తాను నిబద్ధతతో చేస్తున్నానని స్పష్టం చేశారు.

తెలంగాణ సమాజం ఇప్పుడు మార్పును కోరుకుంటోందని, ఆ మార్పుకు తమ పార్టీ వేదికవుతుందని కవిత వివరించారు. కింది స్థాయి నుంచి వచ్చిన సామాన్య కార్యకర్తలను కూడా నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటానని తెలిపారు. ఏ నిర్ణయమైనా సమిష్టిగా, ప్రజాప్రయోజనాల దృష్ట్యా తీసుకుంటామని, పార్టీ మేనిఫెస్టో కూడా సామాన్యుడి కష్టాలను ప్రతిబింబించేలా ఉంటుందన్నారు. రాష్ట్ర రాజధాని నుంచి మారుమూల గ్రామం వరకు తమ పార్టీ జెండా ఎగిరేలా పటిష్టమైన కార్యచరణను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య వైరుధ్యాలు ప్రజలకు శాపంగా మారాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పక్షం వైఫల్యాలను ఎండగట్టడంలో ప్రధాన ప్రతిపక్షం విఫలమైందని, ఆ బాధ్యతను తాము స్వీకరిస్తామన్నారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగ అవకాశాలు, వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలపై తమ పార్టీ ప్రత్యేక దృష్టిసారిస్తుందని హామీ ఇచ్చారు. వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడం ద్వారానే సుపరిపాలన సాధ్యమవుతుందని, తమ పార్టీ అధికారంలోకి వస్తే పారదర్శకమైన పాలన అందిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ అస్థిత్వం, ఆత్మగౌరవం కాపాడటమే తమ పార్టీ మొదటి ప్రాధాన్యత అని కవిత పునరుద్ఘాటించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఎవరితోనైనా పోరాడేందుకు సిద్ధమన్నారు. పార్టీ విధివిధానాలు, జెండా, ఎజెండాను మే మొదటి వారంలో జరిగే బహిరంగ సభలో అధికారికంగా వెల్లడిస్తామని చెప్పారు. అప్పటి వరకు జిల్లాల వారీగా పర్యటనలు చేసి, ప్రజల అభిప్రాయాలను సేకరించనున్నట్లు తెలిపారు. కవిత ప్రకటనతో తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త సమీకరణలు మొదలయ్యాయి.

# ఈ నెల 25 నుంచి ఇంటర్ పరీక్షలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి 2026 వార్షిక పరీక్షలకు సంబంధించి కీలక అడుగు వేసింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల హాల్ టికెట్లను గురువారం అధికారికంగా విడుదల చేసింది. ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న థియరీ పరీక్షల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచి లేదా సంబంధిత కళాశాలల ద్వారా పొందవచ్చు. ఈ ఏడాది సుమారు 9.96 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,495 కేంద్రాలను కేటాయించారు. విద్యార్థులకు మరింత వెసులుబాటు కల్పించేందుకు ఈసారి వినూత్నంగా టెక్నాలజీని జోడించారు. విద్యార్థుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా హాల్ టికెట్ డౌన్‌లోడ్ లింక్‌ను ఎస్ఎంఎస్ , వాట్సాప్ ద్వారా పంపించినట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. దీనివల్ల విద్యార్థులు ఎక్కడి నుంచైనా సులభంగా తమ అడ్మిట్ కార్డులను మొబైల్ లోనే చూసుకోవచ్చు.



పరీక్షా కేంద్రాల విషయంలో విద్యార్థులకు ఎదురయ్యే గందరగోళాన్ని నివారించేందుకు హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ ఫీచర్‌ను ప్రవేశపెట్టారు. ఈ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా విద్యార్థులు తమ పరీక్షా కేంద్రం యొక్క ఖచ్చితమైన లొకేషన్, రూట్ మ్యాప్‌ను గూగుల్ మ్యాప్స్ ద్వారా తెలుసుకోవచ్చు. గతంలో పరీక్షా కేంద్రాల కోసం వెతుక్కుంటూ సమయం వృథా అయ్యే ఇబ్బందులను ఇది దూరం చేస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా విద్యార్థులను పరీక్షకు అనుమతించాలని బోర్డు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీనివల్ల చివరి నిమిషంలో సంతకాల కోసం విద్యార్థులు కళాశాలల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. హాల్ టికెట్‌పై ఉన్న ఫోటో, పేరు, ఇతర వివరాలు స్పష్టంగా ఉంటే సరిపోతుందని బోర్డు కార్యదర్శి వివరించారు.

విద్యార్థులు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత అందులోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. పేరు, తండ్రి పేరు, సబ్జెక్టులు, పరీక్షా కేంద్రం చిరునామాలో ఏవైనా పొరపాట్లు ఉంటే వెంటనే సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వాటిని సరిచేసేందుకు బోర్డు కార్యాలయంలో ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు.

పరీక్షల నిర్వహణలో పారదర్శకత ,కట్టుదిట్టమైన భద్రతకు బోర్డు ప్రాధాన్యం ఇస్తోంది. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘాతో పాటు, మాల్ ప్రాక్టీస్ నిరోధానికి ఫ్లయింగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దించుతున్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి.

షెడ్యూల్ ప్రకారం, ఫిబ్రవరి 25న ప్రథమ సంవత్సర విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షతో ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 26న ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మొదటి పరీక్ష ఉంటుంది. పరీక్షా సమయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుంది. విద్యార్థులు కనీసం అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, గడువు ముగిసిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించబోమని అధికారులు హెచ్చరించారు.

విద్యార్థులు తమ వెంట కేవలం హాల్ టికెట్, పెన్నులు, అవసరమైన రైటింగ్ ప్యాడ్‌ను మాత్రమే తీసుకురావాలని, సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు లేదా ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షలు ఇప్పటికే పూర్తి కావడంతో, ఇప్పుడు కేవలం ప్రధాన థియరీ పేపర్లకు మాత్రమే ప్రాధాన్యత ఉండనుంది.

ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తుకు ఈ పరీక్షలు అత్యంత కీలకమైనవి కావడంతో, విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యాశాఖ మంత్రి ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో సహాయం కోసం లేదా ఫిర్యాదుల కోసం బోర్డు ఒక హెల్ప్ లైన్ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు ఎవరినీ సంప్రదించకుండా నేరుగా అధికారిక సమాచారంపైనే ఆధారపడాలని సూచించారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి వెబ్‌సైట్ సర్వర్లు బిజీగా ఉండే అవకాశం ఉన్నందున, విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే తమ కాపీలను ప్రింట్ తీసుకోవడం ఉత్తమం. ఏవైనా సమస్యలు ఎదురైతే కాలేజీ మేనేజ్మెంట్ ద్వారా బోర్డును సంప్రదించి తక్షణమే పరిష్కరించుకోవచ్చు. అందరు విద్యార్థులు విజయవంతంగా పరీక్షలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# గంజాయి చాక్లెట్లతో స్పెషల్ పాలు

**మొదటిపేజీ తరువాయి**

నార్కోటిక్ బ్యూరో అధికారులు బేగంబజార్‌లోని నిర్దిష్ట ప్రాంతాలపై నిఘా ఉంచి, అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న సంచిలను తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో గంజాయి చాక్లెట్లు లభ్యమయ్యాయి. సాధారణ చాక్లెట్ల మాదిరిగానే ప్యాకింగ్ ఉండటంతో సామాన్యులు వీటిని గుర్తించడం కష్టమని అధికారులు చెబుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఈ గంజాయి మిశ్రమాలను నగరానికి తీసుకొచ్చి, ఇక్కడ స్థానిక ఏజెంట్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పట్టుబడిన వారి నుంచి కేవలం మత్తు పదార్థాలే కాకుండా, విక్రయాల ద్వారా వచ్చిన భారీ నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ దందా వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బేగంబజార్ వంటి కిక్కిరిసిన ప్రాంతాల్లో చిన్న చిన్న గల్లీలను అడ్డాగా చేసుకుని, కేవలం తెలిసిన వారికి లేదా కోడ్ లాంగ్వేజ్ వాడే వారికే ఈ పదార్థాలను సరఫరా చేస్తున్నారు. బయటకు కిరాణా దుకాణాలుగానో లేక చిరుతిళ్ల బళ్లుగానో కనిపించే చోట్ల ఈ చీకటి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. స్థానిక పోలీసుల కళ్లుగప్పి ఇంత కాలం ఈ వ్యాపారం ఎలా సాగిందన్న కోణంలో కూడా ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. పట్టుబడిన నిందితుల సెల్ ఫోన్ డేటా ఆధారంగా ఈ గొలుసుకట్టు దందాలో మరి కొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంది. నగరంలో పెరుగుతున్న ఈ డ్రగ్స్ సంస్కృతి పట్ల ప్రభుత్వం సీరియస్ గా ఉంది. ముఖ్యంగా విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తును పాడుచేసుకోకుండా ఉండేందుకు విద్యాసంస్థల సమీపంలో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని, బయట దొరికే తెలియని తినుబండారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ గంజాయి చాక్లెట్ల వల్ల కేవలం తాత్కాలిక మత్తు మాత్రమే కాకుండా, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తనిఖీల్లో వెల్లడైన మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ చాక్లెట్లను ఆయుర్వేద మూలికల మిశ్రమమని నమ్మబలికి అమ్మడం. జీర్ణక్రియకు మంచిదని, నిద్రలేమిని దూరం చేస్తుందని నమ్మించి మధ్యవయస్కులను కూడా ఆకర్షిస్తున్నారు. ఇలాంటి మోసపూరిత మాటలు నమ్మి చాలామంది తెలియకుండానే గంజాయికి బానిసలుగా మారుతున్నారు. నగరంలోని ఇతర ప్రాంతాలైన ధూల్‌పేట, మంగళహాట్ లలో గట్టి నిఘా ఉండటంతో, నిందితులు తమ స్థావరాలను బేగంబజార్ వంటి వ్యాపార ప్రాంతాలకు మార్చినట్లు తెలుస్తోంది. ఇక్కడ జనసమ్మర్దం ఎక్కువగా ఉండటం వీరికి కలిసొచ్చే అంశంగా మారింది.

పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, ఈ ముఠా సభ్యులు రాజస్థాన్, ఒడిశా వంటి ప్రాంతాల నుంచి ముడి సరుకును సేకరిస్తున్నారు. అక్కడి నుంచి రైళ్ల ద్వారా లేదా ప్రైవేట్ బస్సుల ద్వారా చిన్న చిన్న ప్యాకెట్లలో గంజాయి పొడిని నగరానికి తరలిస్తున్నారు. హైదరాబాద్ చేరుకున్నాక, ఇక్కడి రహస్య ప్రాంతాల్లో చాక్లెట్ తయారీ యంత్రాల ద్వారా లేదా చేతులతోనే ఉండలుగా చుట్టి ఆకర్షణీయమైన కవర్లలో ప్యాక్ చేస్తున్నారు. ఈ వ్యాపారం ద్వారా నిందితులు నెలకు లక్షలాది రూపాయలు గడిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పేద వర్గాల ప్రజలను లక్ష్యంగా చేసుకోవడం వల్ల ఫిర్యాదులు వచ్చే అవకాశం తక్కువని వీరు భావించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 'డ్రగ్ ఫ్రీ తెలంగాణ' లక్ష్యంగా అనేక చర్యలు తీసుకుంటోంది. నార్కోటిక్ బ్యూరో ఏర్పాటు చేసినప్పటి నుంచి పెద్ద ఎత్తున సోదాలు నిర్వహిస్తూ డ్రగ్స్ మాఫియా నడ్డి విరుస్తోంది. తాజాగా బేగంబజార్‌లో జరిగిన దాడులు ఈ దిశగా మరో ముందడుగుగా భావించవచ్చు. నిందితులపై కఠినమైన ఎన్డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. వారికి సహకరించిన ఇతర వ్యక్తుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కేవలం విక్రేతలే కాకుండా, వీటిని భారీగా నిల్వ చేసే గోదాములపై కూడా దాడులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. బేగంబజార్ దాడుల అనంతరం నగరవ్యాప్తంగా ఉన్న చిరు వ్యాపార దుకాణాలు, పాన్ షాపులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా గుర్తుతెలియని బ్రాండ్లతో వచ్చే చాక్లెట్లు, క్యాండీలపై ఆంక్షలు విధించే అవకాశం ఉంది. ప్రజలు తమ పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే డయల్ 100 లేదా నార్కోటిక్ బ్యూరో హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.



పౌర సమాజం సహకారంతోనే ఈ మత్తు మహమ్మారిని తరిమికొట్టడం సాధ్యమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మొత్తానికి బేగంబజార్‌లో బయటపడిన ఈ గంజాయి చాక్లెట్ల ఉదంతం నగరవాసులను ఉలిక్కిపడేలా చేసింది. మత్తు పదార్థాల విక్రయదారులు ఎంతటి నీచానికైనా ఒడిగడతారనేదానికి పాలల్లో గంజాయి కలపడం ఒక నిదర్శనం. పోలీసులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నప్పటికీ, ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాబోయే రోజుల్లో మరిన్ని దాడులు నిర్వహించి నగరంలోని గంజాయి నెట్‌వర్క్‌ను పూర్తిగా తుడిచిపెట్టేందుకు పోలీసులు కృతనిశ్చయంతో ఉన్నారు. అప్రమత్తతే ఆయుధంగా ఈ మత్తు రక్కసిని అంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

## హైందవ ధర్మాన్ని కాపాడడంలో
# యువత ప్రత్యేక పాత్ర వహించాలి

- టెలిఫోన్ ఎక్స్చేంజ్ ఏరియాను చత్రపతి శివాజీ చౌరస్తాగా నామకరణం
- భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**మణుగూరు, విశాలభారతి :** చత్రపతి శివాజీ మహారాజ్ 369వ జయంతి సందర్భంగా మణుగూరు మండలంలోని మెయిన్ రోడ్ టెలిఫోన్ ఎక్స్చేంజ్ దగ్గర చత్రపతి యువసేన ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా టెలిఫోన్ ఎక్స్చేంజ్ ఏరియాను చత్రపతి శివాజీ చౌరస్తాగా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు గా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పినపాక ఎమ్మెల్యే అభ్యర్థి పొడియం బాలరాజు, సమితి సింగారం సర్పంచ్ మాధవరావు, పున్నం బిక్షపతి, లింగంపల్లి రమేష్, మెరుగు రవీందర్ నాథ్, తదితరులు పాల్గొని చత్రపతి మహారాజ్ చేసిన సేవలను కొనియాడారు. అదే విధంగా ప్రతి ఒక్క భారతీయుడు చత్రపతి శివాజీ చూయించిన మార్గంలో నడవాలని ముఖ్యంగా యువత చత్రపతిని ఆదర్శంగా తీసుకోవాలని హైందవ ధర్మాన్ని కాపాడడంలో యువత ప్రత్యేక పాత్ర వహించాలని అన్నారు. కులాలకు, మతాలకు ప్రాంతాలకు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు చత్రపతి సాహస చరిత్రను తెలుసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని కోరుతూ అదేవిధంగా చత్రపతి శివాజీ మహారాజ్ నూతన విగ్రహం నిర్మించుకొనుటకు పట్టణ ప్రముఖులందరూ తమవంతుగా నిలబడాలని సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చత్రపతి యువసేన అధ్యక్షులు దుర్గి బ్రహ్మ తేజ, సూత్రపు నాగభూషణం, కర్నేటి మారేష్, భోగ వెంకటేశ్వర్లు, కుంట రవికుమార్, ఉప్పల భాను ప్రకాష్, నిఖిల్, కట్టు నరేష్, పొడపగంటి సాంబ, పోలోజు లోకేష్ చారి, తదితర నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

# ‘బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరూ కాపాడలేరు’

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఖమ్మం జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు టి.హరీష్ రావు పోలీసు యంత్రాంగంపై నిప్పులు చెరిగారు. అధికార కాంగ్రెస్ పార్టీ కనుసన్నల్లో మెలుగుతూ, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలను వేధిస్తున్న పోలీసు అధికారులకు ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, ఆ రోజున చట్ట వ్యతిరేక పనులు చేసిన ఏ అధికారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. అప్పుడు మిమ్మల్ని కాపాడేందుకు ఎవరూ ముందుకు రారని, ఇవన్నీ గుర్తుంచుకుని వ్యవహరించాలని ఆయన హితవు పలికారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, అధికార పార్టీ నేతలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తుంటే పోలీసులు వారికి వత్తాసు పలకడం దుర్మార్గమని హరీష్ రావు మండిపడ్డారు. ఖమ్మం పర్యటనలో భాగంగా దాడులకు గురైన బీఆర్ఎస్ కార్యకర్తలను పరామర్శించిన ఆయన, పోలీసుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఖాకీ చొక్కా వేసుకున్న వారు రాజ్యాంగానికి లోబడి పనిచేయాలే తప్ప, గాంధీ భవన్ ఆదేశాల ప్రకారం కాదని ఆయన ఎద్దేవా చేశారు. తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపితే భవిష్యత్తులో ఆ కేసులన్నీ తిరగదోడతామని ఆయన హెచ్చరించారు.

శాంతిభద్రతలను కాపాడాల్సిన రక్షక భటులే భక్షకులుగా మారుతున్నారని హరీష్ రావు విమర్శించారు. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ శ్రేణులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఎప్పుడూ శాశ్వతం కాదని, వ్యవస్థలు మాత్రమే శాశ్వతమని అధికారులకు గుర్తు చేశారు. ఇప్పుడు



కాంగ్రెస్ నాయకుల ప్రసన్నం కోసం అడ్డగోలుగా వ్యవహరిస్తున్న వారు, రేపు ప్రభుత్వం మారినప్పుడు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ఆయన నిలదీశారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను తాము చూస్తూ ఊరుకోబోమని, ప్రతి కార్యకర్త వెనుక పార్టీ కొండంత అండగా ఉంటుందని హరీష్ రావు భరోసా ఇచ్చారు. నాయకుల ఇళ్లపై దాడులు చేయడం, బెదిరింపులకు దిగడం వంటి చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని ఆయన సూచించారు. అధికారం ఉందని అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, ప్రజాస్వామ్యంలో అరాచకానికి తావులేదని ఆయన పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థను రాజకీయ స్వార్థం కోసం వాడుకోవడం మానుకోవాలని ముఖ్యమంత్రికి హితవు పలికారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పోలీసులకు అత్యంత గౌరవం ఇచ్చామని, శాంతిభద్రతల పరిరక్షణలో వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చామని హరీష్‌రావు గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం పోలీసులను ప్రతిపక్షాల గొంతు నొక్కే ఆయుధాలుగా మార్చుకుందని ఆయన విమర్శించారు. అధికారుల పనితీరుపై ఇప్పటికే ఒక జాబితా సిద్ధం చేస్తున్నామని, ఎవరెవరు చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారో తమకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. సమయం వచ్చినప్పుడు ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అప్పుడు ఎవరూ అడ్డుకోలేరని ఆయన హెచ్చరించారు.

ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ఒకప్పుడు ఉన్న సామరస్య వాతావరణాన్ని కాంగ్రెస్ నేతలు చెడగొడుతున్నారని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ ఉనికి కోసమే తప్పుడు ఆరోపణలు చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. పోలీసు అధికారులకు పదోన్నతులు, పోస్టింగ్ ల కోసం అధికార పార్టీ నేతల కాళ్లు పట్టుకోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. నిక్కచ్చిగా పనిచేసే అధికారులకు తమ మద్దతు ఉంటుందని, కానీ పక్షపాత వైఖరి ప్రదర్శించే వారిని మాత్రం వదిలేది లేదని ఆయన పునరుద్ఘాటించారు.

రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసి, ప్రతిపక్షాలను ఏ విధంగా ఇబ్బంది పెట్టాలనే అంశంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని హరీష్ రావు ధ్వజమెత్తారు. హామీల అమలులో విఫలమైన ప్రభుత్వం, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కుట్రలు చేస్తోందని ఆయన ఆరోపించారు. రైతుల సమస్యలు, నిరుద్యోగుల ఇబ్బందుల కంటే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం పైనే పోలీసులకు ఎక్కువ ఆసక్తి ఉన్నట్లు కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, ఎటువంటి బెదిరింపులకు లొంగవద్దని హరీష్ రావు పిలుపునిచ్చారు. అక్రమ కేసులను ఎదుర్కోవడానికి పార్టీ లీగల్ సెల్ సిద్ధంగా ఉందని, అవసరమైతే కోర్టుల ద్వారా న్యాయం పోరాటం చేస్తామని ఆయన చెప్పారు. పోలీసుల వేధింపులకు గురవుతున్న బాధితులందరి వివరాలు సేకరిస్తున్నామని, భవిష్యత్తులో వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నేడు వేధిస్తున్న వారు రేపు బాధితులుగా మారక తప్పదని, కాలం ఎవరికైనా ఒకేలా ఉండదని ఆయన హితబోధ చేశారు. నాడు తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఇలాంటి ఆంక్షలు ఎదుర్కొన్నామని, అప్పుడు కూడా వెనక్కి తగ్గలేదని హరీష్ రావు గుర్తు చేశారు. ఇప్పుడు అధికార బలంతో అణచివేయాలని చూస్తే అది సాధ్యం కాదని, ప్రజల మద్దతు తమకే ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సేవ చేయాల్సిన పోలీసులు రాజకీయ క్రీడలో పావులుగా మారడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ వైఖరి మార్చుకుని రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని ఆయన హితవు పలికారు. హరీష్ రావు మాట్లాడుతూ.. తెలంగాణాలో కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసకర రాజకీయాలకు తెరలేపిందని అన్నారు. ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ పార్టీకి చెరగని స్థానం ఉందని, రాబోయే ఎన్నికల్లో మళ్ళీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. అప్పుడు తప్పు చేసిన ఏ ఒక్కరినీ విడిచిపెట్టబోమని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ప్రతి అధికారి తన బాధ్యతను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# ఉచిత పథకాలపై సుప్రీం సీరియస్

**విశాలభారతి, జాతీయం:**

దేశంలో ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు గుప్పిస్తున్న ఉచిత హామీలు, వాటి అమలు తీరుపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ప్రజాకర్షక పథకాల పేరుతో రాష్ట్రాల ఖజానాను ఖాళీ చేయడం అభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారుతోందని ధర్మాసనం అభిప్రాయపడింది. తమిళనాడులో ఎన్నికల సమయంలో డిఎంకె ప్రభుత్వం ప్రతిపాదించిన ఉచిత విద్యుత్ అంశంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన కోర్టు, ఈ తరహా పోకడలు దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధానంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు చేసే ఇలాంటి ప్రకటనలు రాజ్యాంగబద్ధమైన సంక్షేమ లక్ష్యాలను దెబ్బతీస్తున్నాయని పేర్కొంది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై విచారణ జరుపుతూ అసహనం వ్యక్తం చేసింది. రాష్ట్రాల ఆదాయ లోటు నానాటికీ పెరుగుతున్నప్పటికీ, ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా ఉచితాల పంపిణీని కొనసాగించడంపై న్యాయమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఆర్థిక క్రమశిక్షణను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి సంస్కృతి వల్ల రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని, భవిష్యత్తు తరాలకు ఇది శాపంగా మారుతుందని కోర్టు హెచ్చరించింది. సంక్షేమం పేరుతో చేస్తున్న ఈ ఖర్చు ఉత్పాదకతను పెంచకపోగా, కేవలం పంపిణీకే పరిమితం కావడం శోచనీయమని పేర్కొంది.

తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదించిన 2024 ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ రూల్స్ ఈ వివాదానికి కేంద్రబిందువుగా మారాయి. వినియోగదారుల ఆర్థిక స్తోమతతో నిమిత్తం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించాలన్న ప్రతిపాదనను కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. విద్యుత్ ఛార్జీలు చెల్లించే స్తోమత లేని నిరుపేదలకు సాయం చేయడం సంక్షేమ రాజ్యంలో సబబేనని, కానీ కోటీశ్వరులు, భూస్వాములకు కూడా ఉచితంగా విద్యుత్ పంపిణీ చేయడం ఏ రకమైన సామాజిక న్యాయమని ధర్మాసనం ప్రశ్నించింది. ఇది కేవలం ఓటర్లను బుజ్జగించే రాజకీయ తంతే తప్ప మరొకటి కాదని నిర్మొహమాటంగా వ్యాఖ్యానించింది. రాష్ట్రాల ఆదాయం పంపిణీ చేసే ఉచితాలకే సరిపోతుంటే, ఇక అభివృద్ధి పనులకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయని సుప్రీంకోర్టు నిలదీసింది.



ప్రభుత్వం సంపాదించే ప్రతి రూపాయి జీతాలు, పెన్షన్లు, ఉచిత పథకాలకే ఖర్చవుతుంటే, మౌలిక సదుపాయాల కల్పన కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. రహదారులు, ఆసుపత్రులు, విద్యాసంస్థల వంటి శాశ్వత ఆస్తుల కల్పనకు నిధులు లేక రాష్ట్రాలు వెనుకబడిపోతున్నాయని ధర్మాసనం పేర్కొంది. ఈ పరిస్థితి ఒక్క తమిళనాడుకే పరిమితం కాలేదని, దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా ధోరణి కనిపిస్తోందని కోర్టు విశ్లేషించింది. ఉచిత పథకాల వల్ల ప్రజల్లో సోమరితనం పెరిగే ప్రమాదం ఉందని, దానికంటే ఉపాధి సృష్టిపై దృష్టి పెట్టాలని సుప్రీంకోర్టు రాష్ట్రాలకు హితవు పలికింది. ఆహారం, సైకిళ్లు, విద్యుత్ వంటివి ఉచితంగా ఇవ్వడం ద్వారా స్వల్పకాలిక ప్రయోజనం ఉండొచ్చు కానీ, ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడాలంటే వారికి పని కల్పించడమే మార్గమని స్పష్టం చేసింది. చేతికి పని దొరికితే వారు తమ అవసరాలను తామే తీర్చుకోగలరని, తద్వారా ప్రభుత్వంపై భారం తగ్గుతుందని సూచించింది. ఉచితాల సంస్కృతి నుంచి బయటపడి స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం నొక్కి చెప్పింది. ఎన్నికలకు సరిగ్గా ముందే ఇలాంటి బృహత్తర పథకాలను ఎందుకు తెరపైకి తెస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాలను న్యాయస్థానం ప్రశ్నించింది. పరిపాలనా కాలమంతా నిమ్మకు నీరెత్తినట్లు ఉండి, ఎన్నికల నగారా మోగే సమయానికి ఉచితాల వరద పారించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడమేనని ఆగ్రహించింది. విద్యుత్ టారిఫ్‌లను అధికారికంగా నోటిఫై చేసిన తర్వాత, హఠాత్తుగా అందరికీ ఉచితమని ప్రకటించడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో అందరికీ తెలుసని వ్యాఖ్యానించింది. ఇలాంటి విధానాల వల్ల విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్ లు) తీవ్ర నష్టాల్లో కూరుకుపోయి, చివరకు వ్యవస్థే కుప్పకూలే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

అర్హులైన వారికి మాత్రమే పథకాలు అందాలన్నది న్యాయస్థానం ప్రధాన ఉద్దేశమని విచారణలో వెల్లడైంది. లబ్ధిదారుల ఎంపికలో శాస్త్రీయత లోపిస్తోందని, సంపన్నులు కూడా ఉచిత సదుపాయాలను అనుభవిస్తుంటే పేదలకు అందాల్సిన వాటా తగ్గుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చేయూతనివ్వడం రాజ్యాంగ విధి అయినప్పటికీ, దానిని రాజకీయ లాభం కోసం దుర్వినియోగం చేయకూడదని పేర్కొంది. పారదర్శకమైన విధానం ద్వారా నిజమైన పేదలను గుర్తించి, వారికి మాత్రమే రాయితీలు పరిమితం చేయాలని సూచించింది. దేశాభివృద్ధికి అడ్డంకిగా మారుతున్న ఈ ఉచితాల విధానంపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని, విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆర్థిక నిపుణులు, రిజర్వ్ బ్యాంక్ వంటి సంస్థల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ రాష్ట్రాలు అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై కూడా ధర్మాసనం ఆసక్తి కనబరిచింది. రాష్ట్రాల ఆర్థిక క్రమశిక్షణను పర్యవేక్షించడంలో కేంద్రం వైఫల్యం ఉందా అనే కోణంలో చర్చ సాగింది. ఈ కీలక అంశంపై సమగ్ర వివరణ ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఉచిత హామీల నియంత్రణకు ఉన్న అవకాశాలు, రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులపై కేంద్రం తీసుకుంటున్న చర్యలను వివరించాలని ఆదేశించింది. రాబోయే నాలుగు వారాల్లోగా తమ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఈ పిటిషన్ లో లేవనెత్తిన అంశాలు దేశ ఆర్థిక భవిష్యత్తుతో ముడిపడి ఉన్నందున, దీనిని లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. సంక్షేమ రాజ్య స్థాపనలో ప్రభుత్వం పాత్ర కేవలం దానధర్మాలకు పరిమితం కాకూడదని ధర్మాసనం హితబోధ చేసింది.

# మనం ఏఐని శాసించాలి

**విశాలభారతి, జాతీయం:**

ప్రపంచ జనాభాలో ఆరో వంతు వాటా కలిగిన భారత్, కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో ఎప్పుడూ ముందుంటుందని ప్రధాని కొనియాడారు. ముఖ్యంగా దేశ యువత ఏఐ రంగంపై చూపుతున్న ఆసక్తి, మేకిన్ ఇండియా స్ఫూర్తితో సాగుతున్న ఆవిష్కరణలు ప్రపంచానికి దిక్సూచిగా మారుతాయని ధీమా వ్యక్తం చేశారు. భారత్ సాధిస్తున్న ఏఐ పురోభివృద్ధి రాబోయే రోజుల్లో ఒక నూతన చరిత్రను లిఖిస్తుందని ఆయన పేర్కొన్నారు. సాంకేతికత ఎంతటి శక్తిమంతమైనదైనా, అది మానవ కేంద్రీకృతంగా సాగినప్పుడే నిజమైన ఫలితాలు అందుతాయని, ప్రజల సంక్షేమమే ఏఐ విజయానికి కొలమానం కావాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేధకు అపారమైన పరివర్తన శక్తి ఉందని, అయితే అది రెండు అంచుల కత్తి వంటిదని మోదీ అభివర్ణించారు. ఏఐని సద్వినియోగం చేసుకుంటే సంక్లిష్ట సమస్యలకు అద్భుతమైన పరిష్కారాలు లభిస్తాయని, అదే సమయంలో దుర్వినియోగం జరిగితే అది ఊహించని విధ్వంసానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మనుషులు, సాంకేతికత పరస్పర సహకారంతో ప్రయాణించే కొత్త శకంలో మనం ఉన్నామని, భవిష్యత్తులో ఏఐ ఏం చేస్తుందనే ఆందోళన కంటే, ప్రస్తుతం దానిని ఉపయోగించి మనం సమాజానికి ఏం చేయగలమనేదే ముఖ్యమైన ప్రశ్న అని ఆయన విశ్లేషించారు.

ఏఐ వినియోగంపై ప్రపంచానికి దిశానిర్దేశం చేసేలా ప్రధాని మోదీ ‘మానవ్’ అనే వినూత్న విజన్‌ను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ‘ఎం’ అనగా మోరల్ అండ్ ఎథికల్ సిస్టమ్ అని వివరించారు. ఏఐ వ్యవస్థలు కేవలం అల్గారిథమ్స్ ఆధారంగా కాకుండా నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను గౌరవిస్తూ పనిచేయాలని సూచించారు. ఏ వ్యవస్థకైనా నైతికత ప్రాతిపదికగా ఉన్నప్పుడే అది మానవాళికి క్షేమకరంగా మారుతుందని, ఆ దిశగా అంతర్జాతీయ స్థాయిలో కట్టుదిట్టమైన మార్గదర్శకాలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని మోదీ స్పష్టం చేశారు.

జవాబుదారీతనం అనే అంశానికి ప్రధాని అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ‘ఏ’ అంటే అకౌంటబుల్ అని



పేర్కొంటూ, ఏఐ వ్యవస్థలు పారదర్శకమైన నిబంధనలతో పనిచేయాలని కోరారు. ఏదైనా పొరపాటు జరిగినప్పుడు లేదా డేటా విశ్లేషణలో లోపాలు తలెత్తినప్పుడు దానికి బాధ్యులెవరో స్పష్టంగా ఉండాలని, జవాబుదారీతనం లేని సాంకేతికత అరాచకానికి దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. సాంకేతికతపై ప్రజలకు నమ్మకం కలగాలంటే అది పారదర్శకంగా ఉండటం ఎంతో ముఖ్యమని ఆయన ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

జాతీయ సార్వభౌమత్వం గురించి వివరిస్తూ ‘ఎన్’ ప్రాముఖ్యతను మోదీ వెల్లడించారు. ఒక దేశంలో సృష్టించబడిన సమాచారం లేదా డేటా ఆ దేశానికే చెందాలని, అది ఆ దేశ భౌగోళిక పరిధిలోనే భద్రంగా ఉండాలని పట్టుబట్టారు. డేటా అనేది ప్రస్తుత కాలంలో అత్యంత విలువైన సంపద అని, దానిపై ఆయా దేశాలకు పూర్తి నియంత్రణ ఉండాలని చెప్పారు. డేటా భద్రత విషయంలో రాజీ పడకూడదని, సమాచార సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం ద్వారానే దేశ భద్రతను పటిష్టం చేయగలమని ప్రధాని వివరించారు.

సమ్మిళిత అభివృద్ధిని కాంక్షిస్తూ ‘ఏ’ అంటే యాక్సెసిబుల్ అండ్ ఇంక్లూజివ్ అని మోదీ పేర్కొన్నారు. కృత్రిమ మేధ అనేది కేవలం కొందరికే పరిమితమైన లేదా గుత్తాధిపత్యం కలిగిన శక్తిగా ఉండకూడదని ఆకాంక్షించారు. సమాజంలోని అన్ని వర్గాల వారికి, చివరి వరుసలో ఉన్న వ్యక్తికి కూడా ఏఐ ప్రయోజనాలు అందాలని కోరారు. భాషా పరమైన అడ్డంకులను తొలగించడం నుంచి వ్యవసాయం, వైద్య రంగాల వరకు సామాన్యుడికి ఏఐ చేరువైనప్పుడే ‘డిజిటల్ ఇండియా’ లక్ష్యం పరిపూర్ణమవుతుందని ప్రధాని ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. చివరగా ‘వీ’ అనగా వేలిడ్ అండ్ లెజిటిమేట్ అని మోదీ వివరించారు. ఏఐ వినియోగం పూర్తిగా చట్టబద్ధంగా ఉండాలని, అంతర్జాతీయ నిబంధనలకు లోబడి ఉండాలని సూచించారు. విశ్వసనీయత లేని సాంకేతికత వల్ల సమాజానికి ఒరిగేదేమీ ఉండదని, అధికారిక ప్రమాణాలకు అనుగుణంగా ఏఐ పనితీరు ఉండాలని చెప్పారు. చట్టపరిధిలో సాగే ఆవిష్కరణలే స్థిరమైన అభివృద్ధిని ఇస్తాయని, నియంత్రణ లేని సాంకేతికత వల్ల కలిగే అనర్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అంతర్జాతీయ ప్రతినిధులను కోరారు.

భారతదేశం తన సొంత ఏఐ మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేసుకుంటోందని, ఇందులో భాగంగా నేషనల్ ఏఐ మిషన్ వంటి కార్యక్రమాలు ఎంతో తోడ్పడుతున్నాయని ప్రధాని తెలిపారు. ప్రపంచ దేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఏఐ నియంత్రణపై ఒక సామాన్య ఒప్పందానికి రావాలని ఆయన ప్రతిపాదించారు. సాంకేతికత మనిషిని శాసించే స్థాయికి వెళ్లకూడదని, మనిషి తన మేధస్సుతో ఏఐని నియంత్రిస్తూ సమాజ శ్రేయస్సు కోసం వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు. ముగింపులో, ‘వసుధైక కుటుంబకం’ స్ఫూర్తితో భారత్ తన ఏఐ జ్ఞానాన్ని ప్రపంచంతో పంచుకోవడానికి సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ ప్రకటించారు. సాంకేతికత విభజనలకు దారితీయకూడదని, అది ప్రపంచాన్ని ఏకం చేసే వారధిలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సదస్సులో వెలువడే చర్చలు, నిర్ణయాలు ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధ వినియోగంలో నూతన అధ్యాయానికి నాంది పలుకుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు సురక్షితమైన, బాధ్యతాయుతమైన సాంకేతిక ప్రపంచాన్ని అందించడమే మనందరి లక్ష్యం కావాలని పిలుపునిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# మంత్రుల అవినీతి చిట్టా విప్పుతాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని కాంగ్రెస్ మంత్రుల అవినీతి బాగోతాలను త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికార పార్టీ నేతలు అక్రమ సంపాదనలో మునిగిపోయారని, ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలపై తమ వద్ద పక్కా సమాచారం ఉందని, సరైన సమయంలో వాటిని ప్రజల ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. మంత్రుల అండదండలతోనే రాష్ట్రంలో అక్రమ దందాలు సాగుతున్నాయని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుపై బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని, పేదల ఇళ్లను కూల్చి వారిని రోడ్డున పడేయడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వం నిజంగానే మూసీని శుద్ధి చేయాలనుకుంటే, మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలి తప్ప, దశాబ్దాలుగా నివాసం ఉంటున్న సామాన్యుల గూడును చెడగొట్టడం సరి కాదన్నారు. బాధితుల పక్షాన భాజపా నిలబడుతుందని, వారి ఇళ్లపైకి బుల్డోజర్లు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

హైడ్రా పనితీరుపై కూడా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలని, కానీ హైడ్రా కేవలం సామాన్యుల ఇళ్లనే లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు. బడా నేతలు, అధికార పార్టీ నాయకుల అక్రమ కట్టడాలను వదిలేసి, మధ్యతరగతి ప్రజల ఆస్తులపై దాడులు చేయడం అన్యాయమన్నారు. హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం మానుకోవాలని, పారదర్శకత లేని కూల్చివేతలను తాము సహించబోమని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని విమర్శించారు.



రైతు సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో వారిని విస్మరించిందని బండి సంజయ్ అన్నారు. రైతు భరోసా పథకం ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత లేదని, రుణమాఫీ ప్రక్రియ అసంపూర్తిగా మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, రైతులు పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, నేరాలు పెరిగిపోతున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపు చర్యలకే పోలీసులు ప్రాధాన్యత ఇస్తున్నారని, సాధారణ పౌరులకు రక్షణ కరువైందని విమర్శించారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కొత్త కొత్త డ్రామాలకు తెర లేపుతోందని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని హితవు పలికారు. భాజపా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

తెలంగాణలో బీజేపీ ప్రధాన శక్తిగా ఎదుగుతోందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా మారుతామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని, అభివృద్ధి పనులకు కేంద్రం సహకరిస్తున్నా క్రెడిట్ మాత్రం తామే తీసుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రతి పైసాకు లెక్క అడుగుతామని, కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. అప్పుడు అవినీతి రాజ్యమేలితే, ఇప్పుడు అరాచకం కొనసాగుతోందని పోల్చారు. ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, ఆ నమ్మకాన్ని ప్రభుత్వం వమ్ము చేసిందని అన్నారు. పాలన కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని, క్షేత్రస్థాయిలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ప్రతి అంశంలోనూ కేంద్రాన్ని బూచిగా చూపిస్తూ తప్పించుకోవాలని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

తెలంగాణ అభివృద్ధికి భాజపా కట్టుబడి ఉందని, ప్రధాని మోదీ నాయకత్వంలో రాష్ట్రానికి భారీగా నిధులు వస్తున్నాయని వివరించారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల విషయంలో కేంద్రం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ వంటి అంశాల్లో జాప్యం చేస్తూ ప్రాజెక్టులను అడ్డుకుంటోందని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని కాంగ్రెస్ భావిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

నిరుద్యోగుల సమస్యలపై కూడా ఆయన స్పందించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసం చేశారని, నోటిఫికేషన్ల విషయంలో స్పష్టత లేక అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. గ్రూప్ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. యువత భవిష్యత్తుతో ఆడుకోవద్దని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నియామక ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల తరపున భాజపా గళం వినిపిస్తుందని హామీ ఇచ్చారు.

# 8 మంది అవినీతి ఇంజినీర్లపై వేటు

**మొదటిపేజీ తరువాయి**

వారిపై ఇకపై దయ చూపే ప్రసక్తే లేదని ఈ చర్యల ద్వారా ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు పంపింది. చాలా కాలంగా విద్యుత్ శాఖలో క్షేత్రస్థాయి పనుల కోసం వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ బలహీనతను ఆసరాగా చేసుకున్న కొందరు అధికారులు అడుగడుగునా లంచాలకు తెరలేపారు. సస్పెన్షన్ కు గురైన వారిలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు (ఏడీఈ), అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈ) మరియు సబ్ ఇంజినీర్లు ఉండటం గమనార్హం. కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరు నుంచి మొదలుకొని, ప్యానెల్ బోర్డుల ఏర్పాటు మరియు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కేటాయింపు వరకు ప్రతి పనికీ ఒక ధర నిర్ణయించి వసూళ్లకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాల్సిన పనులను కూడా వీరు ధనార్జనే ధ్యేయంగా అడ్డుకున్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ఈ అవినీతి భాగోతం బయటపడటానికి యాంటీ బ్రైబరీ సెల్ కు అందిన ఫిర్యాదులే ప్రధాన కారణమయ్యాయి. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి తమను వేధిస్తున్న అధికారుల వివరాలను ఫిర్యాదు రూపంలో అందించారు. దీనిపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం అత్యంత రహస్యంగా విచారణ చేపట్టింది. క్షేత్రస్థాయిలో బాధితులతో మాట్లాడటం, అధికారుల పనితీరును గమనించడం ద్వారా అక్రమాల తీరును పక్కాగా నిర్ధారించుకుంది. ఇంటెలిజెన్స్ విభాగం సమర్పించిన నివేదిక ఆధారంగా, సదరు అధికారులు విధి నిర్వహణలో ఘోరంగా విఫలమయ్యారని మరియు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని నిర్ధారణకు వచ్చిన ప్రభుత్వం వెంటనే వేటు వేసింది.

ముఖ్యంగా ఈ కేటుగాళ్లు లంచాల స్వీకరణలో ఆధునిక సాంకేతికతను వాడుకోవడం విచారణాధికారులను సైతం విస్మయానికి గురిచేసింది. గతంలో నగదు రూపంలో తీసుకుంటే దొరికిపోతామన్న భయంతో, ఇప్పుడు నేరుగా ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ పేమెంట్ యాప్స్ ద్వారా డబ్బులు



వసూలు చేసినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. కొంతమంది అధికారుల తరపున ప్రైవేటు వ్యక్తులు లేదా మధ్యవర్తుల ఖాతాల్లోకి ఈ సొమ్ము బదిలీ అయినట్లు ఇంటెలిజెన్స్ సేకరించిన సాంకేతిక ఆధారాలు బట్టబయలు చేశాయి. డిజిటల్ లావాదేవీల రికార్డులను పరిశీలించగా, బాధితుల నుంచి పెద్ద ఎత్తున సొమ్ము వసూలు అయినట్లు పక్కాగా తేలిపోయింది.

కొత్తగా ఇళ్లు కట్టుకునే వారు లేదా వ్యాపార సముదాయాలు నిర్మించే వారు విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే, సాంకేతిక కారణాలు సాకుగా చూపి వారాల తరబడి వేధించడం వీరి నైజంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు విషయంలో డిమాండ్ కు తగ్గట్టుగా కాకుండా, ఎవరైతే ఎక్కువ మొత్తంలో కమీషన్లు ఇస్తారో వారికే ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్యానెల్ బోర్డుల నాణ్యత పరిశీలనలోనూ నిబంధనలను తుంగలో తొక్కి, భారీగా ముడుపులు అందిన తర్వాతే అనుమతులు జారీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ తరహా అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడటమే కాకుండా సంస్థ ప్రతిష్ట కూడా మసకబారింది.

ప్రస్తుత ప్రభుత్వం అవినీతిపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తోంది. ఏ శాఖలోనైనా సరే, సామాన్యుడిని పీడించి లంచాలు తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే విద్యుత్ శాఖ మంత్రి మరియు ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి, ఇంటెలిజెన్స్ నివేదికలోని అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టకూడదన్న ఉద్దేశంతోనే ఈ సామూహిక సస్పెన్షన్ల నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఎనిమిది మందితోనే ఇది ఆగదని, జాబితాలో ఇంకా మరికొంత మంది ఉన్నట్లు సమాచారం అందుతోంది. సస్పెన్షన్ వేటు పడిన అధికారులపై తదుపరి శాఖాపరమైన విచారణ కూడా కొనసాగుతుందని టీజీఎస్పీడీసీఎల్ వర్గాలు వెల్లడించాయి. అవసరమైతే వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసే దిశగా కూడా ప్రభుత్వం యోచిస్తోంది. లంచం తీసుకున్నట్లు రుజువైన పక్షంలో వారిని సర్వీసు నుంచి శాశ్వతంగా తొలగించే అవకాశం కూడా ఉంది. ఈ పరిణామంతో విద్యుత్ భవనంలో పనిచేస్తున్న ఇతర అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. గతంలో ఇలాంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు కేవలం బదిలీలతో సరిపెట్టేవారని, కానీ ఇప్పుడు ఏకంగా సస్పెండ్ చేయడం వల్ల కిందిస్థాయి సిబ్బందిలో భయం మొదలైంది.

మరోవైపు, వినియోగదారులు కూడా తమ సమస్యల పరిష్కారం కోసం దళారులను ఆశ్రయించవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది. ఏదైనా పని కోసం విద్యుత్ అధికారులు లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఉన్నతాధికారులకు లేదా యాంటీ బ్రైబరీ సెల్ కు సమాచారం ఇవ్వాలని కోరుతోంది. విద్యుత్ కనెక్షన్ల ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ, సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్ విధానంలో పారదర్శకతను పెంచాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. తద్వారా అధికారులతో ముఖాముఖి సంబంధం తగ్గి, అవినీతికి ఆస్కారం ఉండదని భావిస్తున్నారు.

ఈ ఘటనపై రాజకీయ వర్గాల్లోనూ చర్చ మొదలైంది. ప్రభుత్వ పాలనలో మార్పు వస్తోందని, అవినీతిపరుల ఆటలు సాగవని పాలకపక్షం పేర్కొంటుండగా, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయని విపక్షాలు విమర్శిస్తున్నాయి. అయితే, కారణాలు ఏవైనా ఒకేసారి ఎనిమిది మంది ఇంజినీర్లపై వేటు పడటం అనేది విద్యుత్ శాఖ చరిత్రలో ఒక అరుదైన మరియు కఠినమైన చర్యగా భావిస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు స్పందిస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సామాన్య వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని విద్యుత్ సర్కిళ్లలోనూ ఇలాంటి ఆకస్మిక తనిఖీలు మరియు ఇంటెలిజెన్స్ విచారణలు కొనసాగుతాయని తెలుస్తోంది. కేవలం విద్యుత్ శాఖే కాకుండా, రెవెన్యూ, మున్సిపల్ వంటి ఇతర ప్రజా సంబంధిత శాఖల్లోనూ అవినీతి నిరోధక చర్యలు వేగవంతం కానున్నాయి. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఫలితం ఇలాగే ఉంటుందని ఈ సస్పెన్షన్ ఉదంతం హెచ్చరిస్తోంది. ఇకనైనా అధికారులు తమ తీరు మార్చుకుని పారదర్శకంగా సేవలు అందించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## నూతన చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంకి ఘన సన్మానం



**కోదాడ, విశాలభారతి:** కోదాడ మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు దంపతులను ది కోదాడ లారీ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. గురువారం పట్టణంలోని వారి నివాసంలో అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుసుమ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టడం పట్టణానికి గర్వకారణమని, ఆమె నాయకత్వంలో కోదాడ మున్సిపాలిటీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దబడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. అదేవిధంగా తమ అసోసియేషన్ నాయకులు ఐదుగురు కౌన్సిలర్లుగా ఎన్నిక కావడం తమకు ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. కొత్తగా ఎన్నికైన పాలకవర్గం కోదాడ పట్టణ ప్రజల ఆకాంక్షాలు నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు తూనం కృష్ణ, సెక్రటరీ యలమందల నరసయ్య, వైస్ ప్రెసిడెంట్ చంద్రమౌళి, కోశాధికారి జానీ బాబా, జాయింట్ సెక్రటరీ కోటేశ్వరరావు, సామా వెంకట్ రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా గౌరవ అధ్యక్షులు పైడిమర్రి వెంకటనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల రామారావు రాష్ట్ర చైర్మన్ రామినేని శ్రీనివాస్, పెద్ది అంజయ్య, దొంగరి శ్రీను, గౌస్,తోట శ్రీను, గుండపునేని నాగేశ్వరరావు, విలాసకవీ నరసరాజు, ఆవుల బాబు తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారా స్థావరాలపై సంయుక్త దాడులు



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటుసారా తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించారు. అనంతారం, పెద్దతండా, సిరోలు మండలంలోని తాళ్ల సంకీసా, వసరం తండా, మన్నెగూడెం మరియు కొత్తతండా గ్రామాలలో సంయుక్తంగా నిర్వహించిన ఈ చర్యల్లో అక్రమ సారాయి తయారీ స్థావరాలను గుర్తించి ధ్వంసం చేశారు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌తో పాటు వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, డీటీఎఫ్ -మహబూబాబాద్ మరియు ఎస్టీఎఫ్ - హైదరాబాద్ బృందాలు కలిసి ఈ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించాయి. ఈ దాడుల్లో మొత్తం ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని సంబంధిత తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. దాడుల సమయంలో అధికారులు 19 లీటర్ల నాటుసారా, 50 కిలోల బెల్లం, 30 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. అలాగే సారాయి తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అక్రమ మద్యం తయారీకి ఉపయోగించే సామగ్రిని కూడా అక్కడికక్కడే నిర్వీర్యం చేశారు. ఈ ఆపరేషన్‌లో ఎక్సైజ్ సీఐలు జి. చిరంజీవి, ఎన్. బిక్షా రెడ్డి, ఐ. అశోక్ కుమార్ నాయకత్వం వహించగా, ఎస్సైలు బాలరాజు, శిరీషతో పాటు కానిస్టేబుళ్లు వెంకన్న, నరసింహారావు, ఇబ్రహీం, శ్రీనివాస్, రాజ్‌కుమార్ మరియు ట్రైనీ ఎస్సై శరీస్ పాల్గొన్నారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై భవిష్యత్తులో కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ప్రజలు నాటుసారా సమాచారాన్ని అధికారులకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్, విశాలభారతి:** విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీస్తూ, వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా కేంద్రంలోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్ లో యంగ్ ఇన్నోవేటర్స్ ఇన్ యాక్షన్ పేరుతో గురువారం "ఆవిష్కార్" కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థిని విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శనల నమూనాలను ఎంతో ఆసక్తితో తిలకించారు. లాభదాయకమైన కూరగాయల పంటల సాగు, సోలార్ వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ఉపకరించే సాధనాలు, కాలుష్య నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలు, ఆరోగ్యకరమైన ఆహారం, సన్ డయల్, అంతరిక్ష పరిశోధన నమూనాలు తదితర అంశాలపై సరికొత్త ఆలోచనలతో సృజనాత్మకతను జోడిస్తూ ప్రదర్శనలు రూపొందించిన విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు. ఒక్కో ఎగ్జిబిట్ ను సందర్శిస్తూ, వాటి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేవలం తరగతి గది, పుస్తకాలకే పరిమితం కాకుండా అనేక అంశాలలో విద్యార్థులు సైన్స్ ఫేర్ లో పాల్గొని తమ ప్రతిభను చాటడం ఎంతో గొప్ప విషయమని, ఈ దిశగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని కొత్తకొత్త ప్రయోగాలు చేసేలా తోడ్పాటును అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సంతోష్, శ్రీదేవి, ప్రిన్సిపాల్ ఆంథోని, లత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కంచన్‌పల్లిలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎంపీడీఓ



**వలిగొండ, విశాలభారతి:** వలిగొండ మండలంలోని కంచన్‌పల్లి గ్రామాన్ని గౌరవ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి సందర్శించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద లబ్ధిదారురాలు కొలిచెలిమి నాగ గృహాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రేసు బుచ్చి రెడ్డి, వార్డు సభ్యులు మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి హాజరయ్యారు. గృహ నిర్మాణం పూర్తయినందుకు లబ్ధిదారురాలు ఆనందం వ్యక్తం చేయగా, తుది విడత నిధుల మంజూరు త్వరితగతిన ఆమోదం పొందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన హాజరు నమోదు పుస్తకం, స్టాక్ రిజిస్టర్ మరియు సరఫరా చేస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. గర్భిణీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## కమిషనర్‌ని కలిసిన మేయర్ మహంకాళి స్వామి



**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం నగర పాలక సంస్థ నూతన మేయర్ గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను గురువారం కమిషనరేట్ లో మహంకాళి స్వామి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల మొక్క బహుకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ నగర మేయర్ కి శుభాకాంక్షలు తెలిపారు.

## ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలకు హాజరైన మేయర్ మహంకాళి స్వామి



**విశాలభారతి, గోదావరిఖని:** సాహసానికి మారు పేరు ఛత్రపతి శివాజీ అని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కొనియాడారు . ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకొని గురువారం జి . ఎం . కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి దేశంలో మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన యోధుడు ఛత్రపతి శివాజీ అని అన్నారు. ఆయన అవలంభించిన ధర్మ నిరతి , సర్వ మత సమ భావన ఆయన చూపిన బాట తరతరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు ముస్తఫా , గట్ల రమేష్ , దాసరి సాంబమూర్తి , కొలని కవిత , చిదురాల నాగ రాజు , కౌటం సతీష్ , నాయకులు వేగోళపు శ్రీనివాస్ , ఆరే కుల సంఘం నాయకులు సమ్మారావు , ఇతర ప్రతినిధులతో పాటు మీనేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి



**రెండవ డివిజన్ బిజెపి కార్పొరేటర్**

**నిజామాబాద్ , విశాలభారతి:** మాక్లూర్. రెండవ డివిజన్ లో ఈరోజు గురువారం రోజున మాణిక్ బండార్ చౌరస్తా వద్ద రెండవ డివిజన్ బిజెపి కార్పొరేటర్ మారంపల్లి మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలను నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో గర్వించదగ్గ చత్రపతి శివాజీ మహావీరుడు రాజధానిగా సొంత రాజ్యాన్ని స్థాపించాడు వారసత్వం ద్వారా సింహాసనం అదృష్టం వాడు కాదు కనుక మహావీరుడయ్యాడు రాజు కావడానికి బ్రాహ్మణ పండితులు ఏసరించి అవమానించిన అందుకు కృంగిపోకుండా పట్టుదలతో పోరాడి పరిపాలన పగ్గాలు చేపట్టాడు కేవలం రాజుగా పేరు తెచ్చుకోవడం కాదు ప్రజలందరూ నిజమైన పరిపాల కొడిగా హృదయాల్లో నిలుపుకునే స్థానం పొందాడైన ప్రోత్సహించి రైతు పక్షపాతిగా నిలిచాడు తన రాజ్యంలో మహిళలు రక్షణ కల్పించాడు సైనికులకు జీతభత్యాలు ఏర్పాటు చేసి వారు నిరంతరం ప్రజల సేవలో ఉండేలా జాగురికి పరిచాడు 1630 ఫిబ్రవరి 19వ తారీఖున పూణే జిల్లాలోని జౌన్నార్ పట్టణం దగ్గర గల శివుని కోటలో షాహాజీ జిజియాబాద్ పుణ్య దంపతులకు జన్మించాడు శివాజీ వీరు మహారాష్ట్రలోని వ్యవసాయం బోస్లే కులానికి చెందినవారు శివాజీ యాదవ్ అలాగే నూతనంగా ఈ రెండవ డివిజన్ బిజెపి నుండి నన్ను రెండవ డివిజన్ కార్పొరేటర్ గా నా ప్రజలు నన్ను గెలిపించారు నాకు ఈ శివాజీ జయంతి వేడుకలు జరుపుకోవడానికి నాకు ఈ పెద్ద అవకాశం రావడం జరిగినది. నేను నా రెండవ డివిజన్ ప్రజలందరికీ ఎల్లవేళలా ప్రజలందరికీ సేవ చేసుకుంటూ ఉంటానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో... రెండు డివిజన.బిజెపి గ్రామ శాఖశివలాల్... బిజెపి సీనియర్ నాయకుడు అర్జున్ సింగ్. బిజెపి యువ శక్తి నాయకుడు నర్సయోళ్ల లక్ష్మణ్.. బిజెపి యువ నాయకుడు నర్సయోళ్ల అనిల్... ధర్పల్లి శ్రీనివాస్ కిరణ్.. సాయిబాబా. హన్మాండ్లు. మరియు బిజెపి కార్యకర్తలు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## సీబీఐటీలో అట్టహాసంగా 'శ్రుతి–2026' ప్రారంభం




**ముఖ్య అతిథిగా ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణరావు**

**హైదరాబాద్, విశాలభారతి:** గండిపేటలోని చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వార్షిక సాంస్కృతిక ఉత్సవం 'శ్రుతి - 2026 (అసెండ్రా)' ఫిబ్రవరి 19న ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణరావు, ఐఏఎస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అతిథులుగా డీఆర్డీఓ సైంటిస్ట్ శ్రీ నిలాంగ్ త్రివేది, ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు కళాశాల వార్షిక న్యూస్ లెటర్ ను విడుదల చేసి, విద్యార్థుల విద్యా ప్రగతిని, పరిశోధన విజయాలను అభినందించారు. ముఖ్య అతిథి రామకృష్ణరావు మాట్లాడుతూ.. దేశ నిర్మాణంలో ఉన్నత విద్యాసంస్థల పాత్ర కీలకమని, విద్యార్థులు క్రమశిక్షణతో సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిలాంగ్ త్రివేది ఆధునిక సాంకేతికత , పరిశోధనల ప్రాధాన్యతను వివరించగా, శేఖర్ కమ్ముల తన సినీ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, పట్టుదలను ప్రేరేపించారు. సుధీ చైర్మన్ ప్రొఫెసర్ జి. లక్ష్మయ్య ఈ వేదిక విద్యార్థుల ప్రతిభకు నిలువుటద్దమని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు సీబీఐటీ సాధించిన జాతీయ ర్యాంకింగ్స్, ప్లేస్‌మెంట్స్ మరియు అంతర్జాతీయ భాగస్వామ్యాల గురించి నివేదికను సమర్పించారు. అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. సీబీఐటీ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతూ, విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతూ ఈ వేడుక విజయవంతంగా కొనసాగుతోంది.




## ఆరె సంఘం ఆధ్వర్యంలో ఘనంగా చత్రపతి శివాజీ జయంతి



**చిట్యాల, విశాలభారతి:** మండలంలోని ఆరెగూడెం గ్రామంలో ఆరెకుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మోటి మల్లయ్య,ప్రధాన కార్యదర్శి మోకిడి వినయ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు గ్రామంలోని ఛత్రపతి శివాజీ విగ్రహాన్నికి పూలమాల వేసి నినాదాలు చేస్తూ నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆరెగూడెం గ్రామ సర్పంచ్ నాగంపల్లి శ్యాంసుందర్, ఆరె సంఘం ఉపధ్యక్షుడు సాపిడి.శేఖర్,మూరల. శేఖర్, కోశాధికారి మూరల. మహేష్, ప్రచార కార్యదర్శి ధర్నె.శ్రీను, లాడే.మహేష్, సహాయకార్యదర్శి. నాగలగని. శ్యామ్,సాపిడి. సోమయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు



**ఆదిలాబాద్, విశాలభారతి:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రము లోని స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల లో హిందూ సామ్రాజ్య స్థాపకుడు, మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ని పురస్కరించుకొని పాఠశాల లో జయంతి వేడుకలు నిర్వహించారు. ఆచార్యులు విద్యార్థులు శివాజీ మహరాజ్ ప్రతిమకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ప్రధానాచార్యులు మరాఠీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు వివరిస్తూ హిందూ సామ్రాజ్య స్థాపన కోసం తన ప్రాణాలను అర్పించి ఎంతో మందికి స్ఫూర్తి దాయకం గా నిలిచి యుద్ధం లో శత్రువులను చీల్చి చెండాడి మట్టి కరిపించిన తీరును వివరించారు. ఛత్రపతి శివాజీ యొక్క గొప్పతనాన్ని,ధైర్య సాహసాలను, హిందుత్వ నిష్టను మనమంతా ఆదర్శంగా తీసుకొని భారతీయ విలువలను పెంపొందించు కోవాలనీ అన్నారు.ఆచార్యులు ఉషారాణి, భారతి,సుజాత,మంజుల,శంకర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ జయంతి ఉత్సవం



**తిరుమలగిరి, విశాలభారతి :** శుక్రవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ 396 వ.జయంతి సందర్భంగా తొండ గ్రామంలో శివాజీ అభిమాన సైన్యం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచి భాషమల్ల స్వాతి భాస్కర్,ఉప సర్పంచ్ వెంకన్న, వార్డ్ సభ్యులు, మరియు గ్రామ యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## కీసర గుట్ట హుండీ ఆదాయం 92 లక్షలు

**కీసర,విశాల భారతి :** కీసర గుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల హుండీ ఆదాయం 92 లక్షల రూపాయలు వచ్చింది.గురువారం ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ,ఈ ఓ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిపిన ఆలయ అధికారులు.వివిధ సేవల టికెట్స్ ద్వారా వచ్చిన ఆదాయం 64 లక్షల పై చిలుకా,హుండీ ఆదాయం 24 లక్షల 36 వేయిల రూపాయలు మొత్తం హుండీ ఆదాయం 92 లక్షల 72 వేల రూపాయలు వచ్చింది.గత సంవత్సరం బ్రహ్మోత్సవాలకు వచ్చిన మొత్తం ఆదాయం 92 లక్షల 49 వేల రూపాయలు.ఈ సంధర్భంగా ఆలయ చైర్మన్ వెంకటేశ్ శర్మ మాట్లాడుతూ పోయిన సంవత్సరం ఈ సంవత్సరానికి బ్రహ్మోత్సవాలకు ఎక్కువ వచ్చిన ఆదాయం కేవలం 20 వేల రూపాయలు మాత్రమే అని తెలిపారు.ఈ సంవత్సరం ఆసియా ఖండంలోనే అతి పెద్ద జాతర సమ్మక సారక్క జాతర జనవరిలో జరిగింది కావున వెంటనే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఉండడంతో కాస్త హుండీ ఆదాయం తగ్గింది ఉండొచ్చు అని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఏది ఏమైనా కానీ కీసర గుట్ట బ్రహ్మోత్సవాలను జయప్రదం చేసిన వివిధ శాఖల అధికారులకు అందరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు సపరిడెంట్ రాజన్న,అనిల్,వెంకట్ రావు,ఆలయ వేద పండితులు బలరాం శర్మ,రవి శర్మ తదితరులు పాల్గొన్నారు.



# బహుజన చక్రవర్తి ఛత్రపతి శివాజీ

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :**



మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన ఛత్రపతి శివాజీ మహాWరాజ్ కేవలం ఒక మతానికి పరిమితుడైన నాయకుడు కాదని, ఆయన బహుజనుల చక్రవర్తి, సామాజిక విప్లవకారుడని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ 396వ జయంతి సందర్భంగా గురువారం రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్-3లో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో, మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శివాజీ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వారు ప్రసంగించారు. అసమాన కులవ్యవస్థలో అణచివేతకు గురైన ప్రజలను ఏకం చేసి జాతీయ భావన కల్పించిన మహానేత శివాజీ అని వారు పేర్కొన్నారు. బ్రాహ్మణ వర్గం ఆయనను 'శూద్రుడు' అనే కారణంతో రాజుగా గుర్తించడానికి నిరాకరించినా, సబ్బండ వర్గాలను ఏకం చేసి రాజ్యాధికారాన్ని సాధించిన బహుజన సార్వభౌముడిగా నిలిచారని తెలిపారు. శివాజీని కేవలం ఒక మత చట్రంలో బంధించడం ఆయన విరాట్ స్వరూపాన్ని కుంచించడం వంటిదని విమర్శించారు. ఆయన పోరాటం మతంపై కాదని, అణచివేతపై అని స్పష్టం చేశారు. శివాజీ అంటే కాషాయం కాదని, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య శక్తి అని కొనియాడారు. చరిత్రను వక్రీకరించి మతాల మధ్య విభేదాలు రేకెత్తించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, బిజిసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, సిపిఐ నాయకులు కాటి అరుణ, మధు, యేశాలి నర్సింహ, సైదులు ముదిరాజ్, నవనీత, పెరాల గోపి, యాదగిరి, రాఘవేంద్ర, సుధాకర్, దేవమ్మ, నిరంజన్, పాండు, వీణ, నీలా, కావేరి తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగి ఏసీపీ కార్యాలయంలో ఎర్త్ మూవర్స్‌తో అవగాహన సమావేశం



**రాజంద్రనగర్, విశాలభారతి :** నార్సింగి ఏసీపీ కార్యాలయంలో 19022026న ఎర్త్ మూవర్స్ మరియు టిప్పర్ వాహన యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు, వాహనాల చట్టబద్ధ పత్రాలు, వ్యర్థాల పారవేతపై అవగాహన కల్పించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో అధికారులు టిప్పర్ వాహన యజమానులకు మరియు డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. టిప్పర్ డ్రైవర్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు ఆర్‌సీ, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. రోడ్లపై టిప్పర్ వాహనాలను నిర్లక్ష్యంగా నడపకుండా, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. రోడ్లపై వ్యర్థాలు, నిర్మాణ అవశేషాలు పడేసే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. భవన నిర్మాణానికి సంబంధించిన చెత్తచెదరాన్ని జీహెచ్ఎంసీ కేటాయించిన గౌలిదొడ్డి ప్రాంతంలో మాత్రమే వేయాలని సూచించారు. ఈ సమావేశానికి సైబరాబాద్ పోలీస్ పరిధిలోని నార్సింగి ఏసీపీ జి.వి. రమణ గౌడ్, జోనల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, నార్సింగి డివిజన్ ఇన్‌స్పెక్టర్లు జి. హరికృష్ణ రెడ్డి, యం. బాల్ రాజ్, గణేష్ పటేల్ తదితరులు హాజరయ్యారు. అధికారులు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.;

## శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి

**శివం హిల్స్ కాలనీలో ఘనంగా నిర్వహించిన జయంతి కార్యక్రమం**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శివం హిల్స్ కాలనీలో ఘనంగా నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, మన్సూరాబాద్ తాజా మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు, హిందూ సంస్కృతి పరిరక్షణలో చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందుతూ సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. కాలనీ అభివృద్ధి కోసం ఎప్పటికీ తాను ముందుండి పనిచేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 21న విద్యుత్ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం

**ముషీరాబాద్,విశాల భారతి:** విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు ఏడిఈ ధనంజయ్ తెలిపారు. ఈనెల 21న శనివారం వివిఎస్టీ ఇండస్ట్రియల్ ఏరియాలోని 33/ 11 కెవి సబ్ స్టేషన్ లో పరిష్కార వేదిక ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి టెక్నికల్, ఫైనాన్స్, కన్జ్యూమర్ ఎఫైర్స్ అధికారులు హాజరవుతున్నారని చెప్పారు. కాచిగూడ, బర్కత్పుర, శంకరమఠ్, నల్లకుంట, విద్యానగర్ తదితర పరిసర ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు తమ దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలపై ఫిర్యాదు చేసి తగిన పరిష్కారం పొందాలని గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

## నాగోల్‌లో మహిళ అదృశ్యం

**భర్త ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభం**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత మహిళ అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధిత భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. నువ్వుల బండ, జైపురి కాలనీకి చెందిన కొట్టపల్లి శ్రీనివాస్ (40), వృత్తిరీత్యా హోటల్ ఉద్యోగి, 19022026 మధ్యాహ్నం పోలీసులను ఆశ్రయించారు. తన భార్య కొట్టపల్లి జ్యోతి (35) గత నాలుగు రోజులుగా కనిపించకుండా పోయిందని ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్ తెలిపిన ప్రకారం..తేది 14022026 ఉదయం ఆమె అధికంగా మద్యం సేవించడంతో మందలించగా, అదే రోజు రూ.150 తీసుకుని వెళ్లిందని . అనంతరం 15022026 సాయంత్రం నుండి ఇంటికి రాలేదని తెలిపారు. మొదట మద్యం సేవించి తిరిగి వస్తుందని భావించినప్పటికీ, మరుసటి రోజు కూడా రాకపోవడంతో బంధువులు, పరిచయస్తులు, పొరుగువారిని సంప్రదించినా ఎలాంటి సమాచారం లభించలేదని పేర్కొన్నారు. దీంతో బాధితుడి ఫిర్యాదు ఆధారంగా క్రైమ్ నం.116/2026 కింద మహిళ అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. కేసు దర్యాప్తును మహిళా హెడ్ కానిస్టేబుల్ ఎం. శారదకు అప్పగించినట్లు తెలిపారు. అదృశ్యమైన మహిళ ఎత్తు సుమారు 5 అడుగులు, గోధుమవర్ణం, గుండ్రని ముఖం కలిగి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆమె గురించి సమాచారం తెలిసిన వారు నాగోల్ పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.పోలీసులు వివిధ కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి నివాళులు అర్పించిన కళ్లెం

**బి.ఎన్.రెడ్డి నగర్‌లో ఘనంగా జయంతి వేడుకలు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బి.ఎన్.రెడ్డి నగర్ పరిధిలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించబడింది. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి నివాసమైన సింహగఢ్, ఛత్రపతి హిల్స్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ విగ్రహానికి తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ ఒక మహా యోధుడు మాత్రమే కాకుండా ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పరిపాలించిన దూరదృష్టి గల నాయకుడని పేర్కొన్నారు. స్వాభిమానం, ధైర్యం, దేశభక్తి, ధర్మ పరిరక్షణలో ఆయన చూపిన సంకల్పబలం నేటి తరానికి గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. యువత శివాజీ మహారాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో న్యాయం, నిజాయితీ, సేవా భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశం కోసం త్యాగం చేసిన మహానుభావుల జీవిత చరిత్రలను అధ్యయనం చేసి వాటి నుంచి ప్రేరణ పొందాలని సూచించారు. ప్రజల సేవే తన ధ్యేయమని, శివాజీ మహారాజ్ చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**టీచర్ వేధింపుల ఆరోపణలు**




**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భవాని కాలనీలో ఉన్న వైష్ణవి జూనియర్ కాలేజీ లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న రితిక అనే విద్యార్థిని కాలేజీ భవనం పై మూడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఘటన అనంతరం కాలేజీ సిబ్బంది వెంటనే స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మైత్రి హాస్పిటల్‌కు తరలించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆమెకు చికిత్స కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, టీచర్ వేధింపుల కారణంగానే రితిక ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు సహ విద్యార్థినులు ఆరోపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆరోపణలపై స్పష్టత రావాల్సి ఉంది. ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. విద్యాసంస్థల్లో విద్యార్థులపై మానసిక ఒత్తిడి, వేధింపుల అంశంపై మరోసారి చర్చ మొదలైంది.

## తాసిల్దార్ ఫోటో మరచిన కళాభారతి

- **పట్టణ ప్రముఖుల ఫోటోలు అధికారులు ఫోటోలు పెట్టారు**
- **ఒక్క తాసిల్దార్ ఫోటో మార్చారు**
- **భద్రాద్రి కళాభారతి వారికి తాసిల్దార్ కనపడలేదా**
- **తాసిల్దార్ ఫోటో లేకపోవటం అత్యంత దారుణం**
- **ఖండిస్తున్న గడ్డం సుధాకర్‌రావు తోకల దుర్గాప్రసాద్**

**భద్రాచలం, విశాలభారతి:**




భద్రాచలంలో జూనియర్ కాలేజీ గ్రౌండ్లో భద్రాద్రి కళాభారతి వారు ఏర్పాటుచేసిన కల్చరల్ కార్యక్రమం లో భద్రాచలం కి చెందిన ప్రముఖుల పేర్లు ఫోటోలు అలాగే అధికారుల పేర్లు ఫోటోలు ఆహ్వాన పత్రికలో ముద్రించారని అందులో భద్రాచలం తాసిల్దార్ ఫోటో కానీ పేరు గాని పెట్టకపోవడం తాసిల్దార్ని అవమానపరచడమేనని ప్రముఖ పత్రిక విలేఖరి గడ్డం సుధాకర్ రావు అలాగే ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తోకల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా భద్రాద్రి కళాభారతి వారు భద్రాచలం తాసిల్దార్ ఫోటోను పేరును ఆహ్వాన పత్రికలు ముద్రించాలని వారు కోరారు ఆహ్వాన పత్రిక ముద్రించేముందు అనేకమంది అధికారులు పేర్లు ఫోటోలు అలాగే కొంతమంది నాయకుల పేర్లు ఫోటోలు ముద్రించిన భద్రాద్రి కళాభారతి వారు భద్రాచలం తాసిల్దారుని మర్చిపోవడం అవమానపరచడమేనని వారు అన్నారు. భద్రాచలం జూనియర్ కాలేజీ గ్రౌండ్లో నిర్వహిస్తున్న కల్చరల్ కార్యక్రమానికి ఒక తాసిల్దార్ కనిపించకపోవడం అత్యంత దారుణమైన అంశంగా పరిగణలోకి తీసుకోవాల్సి వస్తుందని వారు అన్నారు భద్రాచలంలో ఇటువంటి ఏ కార్యక్రమాలు చేసిన ఎమ్మార్వో కి ప్రత్యేక ఆహ్వానం ఉంటుందని కాలింగ్ భద్రాద్రి కళాభారతి వాళ్లు ఆహ్వానించకపోవడం సరైనది కాదని దాన్ని తక్షణమే సరి చేసుకుని తాసిల్దారుని ఆహ్వానించి వారి గౌరవాన్ని కాపాడుకోవాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

## మందలపల్లి ఎస్సీ కాలనీలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**అశ్వారావుపేట, విశాలభారతి :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట నియోజకవర్గం, దమ్మపేట మండలంలోని మందలపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో చాలా కాలంగా కొనసాగుతున్న త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ముందడుగు పడింది. ప్రజల ఆవేదనను దృష్టిలో పెట్టుకుని గ్రామ పంచాయతీ నిధులతో తాగునీటి సౌకర్యం కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న మంచినీటి కొరతపై మండల సీనియర్ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలతో నేరుగా చర్చించి బోర్‌వెల్ ఏర్పాటు, తాగునీటి సౌకర్యం మెరుగుదలతో పాటు సాంకేతిక అంశాలు, నిధుల సమీకరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ముందుగా స్థలాన్ని సేకరించి, సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించి పనులకు అధికారికంగా శ్రీకారం చుట్టారు.పంచాయతీ నిధులతో చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని పూజా కార్యక్రమాల లాంఛనాలతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్వతనేని వరప్రసాద్ మాట్లాడుతూ, "ఎస్సీ కాలనీలో ప్రజలు చాలా కాలంగా తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు తాత్కాలిక పరిష్కారం కాదు, శాశ్వత పరిష్కారమే మా లక్ష్యం. పంచాయతీ నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజల ప్రాథమిక అవసరాలకే మొదటి ప్రాధాన్యం ఉంటుందని ఆయన స్పష్టం చేస్తూ త్రాగునీటి సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభం కావడంతో ఎస్సీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా చేపడుతున్న ఈ చర్యలు మందలపల్లి గ్రామాన్ని అభివృద్ధి దిశగా మరో అడుగు ముందుకు నడిపిస్తున్నాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైల్వే స్టేషన్ రోడ్ విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలి




**ఖమ్మం, విశాలభారతి:**

ఖమ్మం రైల్వే స్టేషన్ రహదారి వెడల్పు విస్తరణ పనులు ఇరువైపులా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీపీఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రైల్వే స్టేషన్ రోడ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వై విక్రమ్ మాట్లాడుతూ దాదాపు సంవత్సరం నుంచి రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి అని, ఇంత వరకు రెండు వైపులా రోడ్ విస్తరణ పనులు పూర్తి చేయకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు.నగరం అంతా విస్తరణ పెరగటం ఫలితంగా రైల్వే స్టేషన్ కు వచ్చే ప్రయాణికులు సంఖ్య రోజూ వేలాది మంది ఈ రోడ్ పై ప్రయాణం చేస్తున్నారు అని, ప్రధానంగా ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తే పరిస్థితి ఏర్పడింది అని తెలిపారు. రోడ్ విస్తరణ చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేశామని, నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత రైల్వే స్టేషన్ రోడ్ కు మార్కింగ్ పెట్టి సంవత్సరం అవుతున్నా ఒకవైపు మాత్రమే షాపింగ్ కాంప్లెక్స్ కూల్చారు అని, రెండు వైపు రోడ్ విస్తరణ పనులు శ్రీనివాస్ థియేటర్ దగ్గరకు వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి అని ఆరోపించారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు కు లొంగకుండా రెండు వైపులా రోడ్ విస్తరణ చేయాలని డిమాండ్ చేశారు. సగం పనులు మాత్రమే చేయడం ఫలితంగా రైల్వే స్టేషన్ రోడ్ ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడుతుంది అని ఆరోపించారు. తక్షణం కార్పొరేషన్ కమిషనర్, మేయర్, మంత్రి జోక్యం చేసుకుని రోడ్ విస్తరణ పనులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఏ జబ్బర్, దొంగల తిరుపతిరావు, భుక్యా శ్రీనువాసురావు, నాగులు మీరా, కార్పొరేటర్ యర్రా గోపి, బోడపట్ల సుదర్శన్, ఎంఏ ఖయ్యాం, నాగరాజు , భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మన్సూరాబాద్‌లో భారీ ఉత్సవ ర్యాలీ

**ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో భారీ ఉత్సవ ర్యాలీ జక్కిడి రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొని శోభాయాత్రకు నాయకత్వం వహించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జడ్జెస్ కాలనీలో ఉన్న శివాజీ పార్క్‌కు భారీ ర్యాలీగా చేరుకున్న నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు అక్కడ ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శివాజీ మహారాజ్ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలవాలని, పరమత సహనం పాటిస్తూ సమాజంలో ఐక్యతను కాపాడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం జడ్జెస్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంప్‌లో పాల్గొని వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమానికి ఆహ్వానించిన కాలనీ పెద్దలకు, సంక్షేమ సంఘం ప్రతినిధులకు, స్థానిక ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.దేశభక్తి నినాదాలతో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో ఈ జయంతి వేడుకలు ఘనంగా సాగాయి. ఈ ఉత్సవ ర్యాలీలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు , కార్యకర్తలు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువత, మహిళలు, శివాజీ మహారాజ్ సైనికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బోడుప్పల్లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి

- **శివాజీ మహారాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన బిజెపి నేతలు**
- **ప్రతి హిందువు ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో కృషి చేయాలి**



**బోడుప్పల్, విశాలభారతి:** హిందూ ధర్మ పరిరక్షకుడు, గెరిల్లా యోధుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు, సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతోత్సవాలను మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు అనంతరం ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందూ ధర్మ పరిరక్షణ కోసం చేసిన కృషిని, మొగల్ చక్రవర్తులతో చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. శివాజీ మహారాజ్ స్ఫూర్తితో నేడు ప్రతి హిందువు ధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోనె శ్రీనివాస్, తుప్పత్ ఆనంద్,రాసాల నర్సింగ్ రావు,ఏనుగు లక్ష్మయ్య, డాక్టర్ ప్రదీప్ కాంత రెడ్డి, శరత్ చంద్ర రెడ్డి, తిరుమలేష్, కరుణాకర్,అరవింద్ ధర్మపురి, గొల్లపూడి శ్రీనివాస్, బజ్జూరి శ్రీనివాస్, కొమరయ్య,సతీష్, జై కిషన్, మురళీధర్,ప్రభులింగం,సంధ్య రెడ్డి, రాధిక, లీలావతి, గురునాథ రావు,అబ్బగాని సతీష్, వేణు గోపాల్,భరత్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొని శివాజీ మహారాజ్ కు నివాళులర్పించారు.

## ఖమ్మం 1 టౌన్‌లో ఛత్రపతి శివాజి జయంతి వేడుకలు



**ఖమ్మం, విశాలభారతి:** భారతీయ జనతాపార్టీ 1టౌన్ అధ్యక్షులు గడిల నరేష్ ఆధ్వర్యంలో స్థానిక గుర్రాలబొమ్మ సెంటర్ (ముస్తఫానగర్ ) నందు ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు నిర్వహించటం జరిగింది . ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు విచ్చేసారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1630 సంవత్సరంలో పూణే నందు షాహాజీ బోంస్లె , జిజీయాబాయి కి జన్మించిన శివాజీ 1674 లో రాయిఘడ్ లో ఛత్రపతి గా పట్టాభిశిక్తుడు అయ్యాడు అని పరమత సహనం తొ అన్ని మతాలను గౌరవిస్తూ అందరివాడయ్యడు అని తెలిపారు . 1 టౌన్ అధ్యక్షులు గడిల నరేష్ మాట్లాడుతూ శివాజీ మహారాజ్ మరాఠా యోధునిగా హిందువుల ఆరాధ్యదైవం గా మొఘలులు దండయాత్ర నుండి భారత దేశం ను కాపాడి అందరి గుండెల్లో ఒక దైవం గా మెలిగాడని వారి ఆదర్శంగా తీసుకుని అందరూ వారి అడుగు జాడల్లో నడిచి ప్రతిఒక్కరు దేశం పట్ల ధర్మం పట్ల గౌరవంగా నడుచుకోవాలని అన్నారు . ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు , డోకుపర్తి రవీందర్ , దుద్దుకూరి వెంకటేశ్వర్లు , మందడపు ప్రభాకర్ రెడ్డి , పొట్టిమూతి జనార్దన్ , బండారు శ్రీను , విజయరాజు , సురేష్ గౌడ్ , బీజేపీ నాయకులు పాలేపు రాము , పొట్టిమూతి వాణి , బొడ్ల శ్రీను , కదుదుల ప్రభాకర్ , బాలి బిందు , లోడంగి సత్యనారాయణ , మరిమెల్ల రామకృష్ణ , పార్వతి , మహీందర్ సింగ్ , కృష్ణ చారి , అశోక్ , మహేష్ , శేఖర్ మరియు హిందూ బంధువులు నాయకులు పాల్గొన్నారు .

## నిశ్చితార్థ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే పాయం



**అశ్వాపురం, విశాలభారతి :** మండలంలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన ఆవుల వెంకన్న, ధనలక్ష్మి దంపతుల కుమారుడు అయిన సంజయ్ కుమార్ కు గురువారం నిశ్చితార్థ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, తుక్కాని మధుసూదన్ రెడ్డి, మల్లెలమడుగు సర్పంచ్ మచ్చ నరసింహారావు, ఆవుల రవి, బచ్చు వెంకటరమణ, కుంజా భాస్కర్, దేవరపు శ్రీను, కొమరం శ్రీను, జెట్టి సాంబయ్య, సంజు సాయి పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**మొయినాబాద్, విశాలభారతి:** సురంగల్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా మొయినాబాద్ మండలంలోని సురంగల్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 13వ వార్డు కౌన్సిలర్ గడ్డం లక్ష్మి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు మరియు పరిపాలనా నైపుణ్యం నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. యువత ఆయన స్ఫూర్తిని తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ రెడ్డి, నరసింహారెడ్డి, అశోక్ గౌడ్, దుర్గం పాండు, వెంకటరెడ్డి, సోమ గోపాల్, కమ్మరి శ్రీనివాస్ చారి, మహేష్, ఇక్బాల్, సాయి తదితరులు పాల్గొని శివాజీ మహారాజ్‌కు ఘనంగా నివాళులర్పించారు. గ్రామ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# విభజించి పాలనేంది పంచాయతీ సార్లు

- వ్యక్తిగత విషయాలను పాలనలో చూపించుట తగునా ?
- ఆవేదన వ్యక్తం చేస్తున్న పండ్ల వ్యాపారి
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వేడుకోలు

**అశ్వాపురం, విశాలభారతి :**

అశ్వాపురం మేజర్ గ్రామపంచాయతీని పాలించే గ్రామపంచాయతీ సార్లు మీకిది తగునా...! పిచ్చుకపై బ్రహ్మాస్త్రమా..? అంటున్నాడు పలువురి వద్ద ఓ పండ్ల వ్యాపారి. దీన్ని విన్నం ప్రజలు ఆ పంచాయతీ అధికారుల పరిపాలన తీరుపై అసహ్యించుకుంటున్నారు. వ్యాపారులందరినీ సమానంగా చూడాల్సిన గ్రామపంచాయతీ అధికారులు ఓ పండ్ల వ్యాపారిపై కక్ష సాధింపులు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండల కేంద్రంలోని గౌతమి నగర్ కాలనీ గేటుకు సమీపంలో ఓ వ్యాపారి పండ్ల దుకాణాన్ని నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సుమారు ఏడాది క్రితం ఈ వ్యాపారి వద్దకు ఈ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న ఓ కార్యదర్శి వచ్చి మాట్లాడుతున్న సందర్భంలో ఇద్దరి మధ్యన చిన్న వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆ సార్ కు తీవ్రమైన కోపం వచ్చింది. అంతే ఇంకేముంది తన ఆధీనంలో పనిచేస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఎట్టి పరిస్థితుల్లో అక్కడ పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్న వారి నుండి వృధాగా పడిన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లో వేసుకోవద్దని కుంకుం జారీ చేశాడు. ఇంకేముంది ఆనాటి నుండి నేటి వరకు అధికారులు మారిన ఆయన శాసించిన శాసనాన్ని మాత్రం స్థానిక పారిశుద్ధ్య కార్మికులు ఆచరిస్తూనే వస్తున్నారు. ఇందులో ఇంకో విచిత్రమైన అంశం ఏమిటంటే మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్లో ఉన్న అందరూ పండ్ల వ్యాపారుల వద్ద ఉన్న చెత్త చదరాన్ని సేకరించుకు వెళుతున్న పారిశుద్ధ్య కార్మికులు గేటు వద్ద ఉన్న వారి దుకాణాల సముదాయంలో ఏర్పడిన చెత్తను తీయకపోగా అక్కడ కనీసం ఊర్చడం లేదని సదరు వ్యాపారి వాపోతున్నాడు. ఈ విషయాన్ని సంబంధిత సర్పంచ్ కు అనేకమార్లు తెలియజేసిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇక చేసేదేమీ లేక ఆ పండ్ల వ్యాపారి నిల్వ ఉన్న చెత్త, ఖాళీ కొబ్బరి బొండాలను ట్రైలలో జాగ్రత్తగా నిలువచేసి ఆయనే ప్రత్యేకంగా ఓ ట్రాక్టర్ ను కిరాయికి తెచ్చుకొని దూర ప్రాంతాలకు తరలిస్తున్నానని చెబుతున్నాడు.





**ప్రతి నెల 1000 రూపాయలు ఇస్తానన్నాను : రాజా పండ్ల వ్యాపారి.**

తన షాపు ద్వారా నిల్వఅయిన ఖాళీ కొబ్బరి బోండాలు, ఇతర చెత్తను ట్రాక్టర్ ద్వారా తరలించుకు వెళితే పంచాయతీకి పన్నుతోపాటు అదనంగా నెలకు రూ. 1 వెయ్యి కూడా ఇస్తానని చెప్పిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని వ్యాపారి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అందరికీ ఒక లెక్క నా ఒక్కడికి ఒక లెక్క ఏంటని..?సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నాడు. సుమారు 40 ఏళ్ల నుండి అశ్వాపురంలో పండ్ల వ్యాపారం చేసుకుంటూ తన నాన్న దగ్గర నుండి జీవిస్తున్నామని ఎన్నడూ లేని విధంగా పంచాయతీ కార్యదర్శులు తనపై కక్ష సాధింపులు చేపట్టడం ఏంటని అంటున్నాడు. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి తన సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకుంటున్నాడు. లేనిపక్షంలో తనకు జరుగుతున్న అన్యాయాన్ని జిల్లా కలెక్టర్ కు తెలియజేస్తా అంటున్నాడు పండ్ల వ్యాపారి.

## హిందూ స్వరాజ్య స్ఫూర్తి చత్రపతి శివాజీ మహారాజ్

**మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



ఎల్బీనగర్, విశాలభారతి : ఎల్.బి నగర్ నియోజకవర్గం, మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో హిందూ సామ్రాట్ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి వివిధ కూడళ్లలో మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చత్రపతి శివాజీ మహారాజ్ కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కొప్పుల నర్సింహ్మా రెడ్డి , చత్రపతి శివాజీ మహారాజ్ జీవిత చరిత్ర యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. హిందూ స్వరాజ్య స్థాపన కోసం ఆయన చేసిన పోరాటాలు, అచంచల ధైర్యం, అపార శౌర్యం, ధర్మ పరిరక్షణలో చూపిన నాయకత్వం భారత చరిత్రలో చిరస్మరణీయమని కొనియాడారు. శివాజీ మహారాజ్ ఆశయాలు సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని, ఆయన చూపిన ధర్మ మార్గంలో నడవడం ప్రతి భారతీయుడి కర్తవ్యమని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో VHP నాయకులు రావినూతల శశిధర్ ,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి మాజీ హయత్ నగర్,బి.యన్ రెడ్డి నగర్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు కళ్లెం రవీందర్ రెడ్డి, అధ్యక్షులు కళ్ళెం శంకర్ రెడ్డి,యాస శ్యాంసుందర్ రెడ్డి,కృష్ణ గుప్తా, మాధవరెడ్డి,సాయిలు గౌడ్,హరినాథ్, రవీందర్ రెడ్డి,ప్రమోద్ రెడ్డి,రాజు యాదవ్,కడారి యాదగిరి, రమేష్ మరయు కాలనీల సంక్షేమ సంఘ సభ్యులు,బిజెపి నాయకులు, శివాజీ అభిమానులు,హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

**కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పిలుపు***



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్‌లోని బృందావన్ కాలనీలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ ధర్మాన్ని ప్రపంచ దేశాలకు చాటిన మహనీయుడు శివాజీ మహారాజ్ అని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆశయ సాధనకు హిందూ బంధువులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్, రావుల భాస్కర్, దయానంద్, సతీష్, నర్సిరెడ్డి, శంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సూర్యకాంత్, విజయ్ కిషన్, జయరాం, మల్లికార్జున్, గున్వంత్ రావు, యాదగిరి, కిషన్ మాస్టర్, అంగద్ భాయ్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో యువకులు, స్థానికులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గాంధీ సరోవర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కసరత్తు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రంగారెడ్డి జిల్లాలో మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గాంధీ సరోవర్ అభివృద్ధి కోసం భూ సేకరణకు సంబంధించి ప్రజాభిప్రాయం సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్ పరిధిలోని బండ్లగూడ జాగిర్, అత్తాపూర్, హైదర్‌గూడ ప్రాంతాల్లో ఈ సమావేశాలు నిర్వహించబడ్డాయి. మూసి రివర్ తీర ప్రాంత అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ద్వారా గాంధీ సరోవర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో అవసరమైన భూ సేకరణపై స్థానిక ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ రాములు, గండిపేట్ ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రాజెక్టు వివరాలను ప్రజలకు సమగ్రంగా వివరించారు. భూ సేకరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని, చట్టప్రకారం తగిన పరిహారం అందజేస్తామని వారు హామీ ఇచ్చారు. సమావేశంలో స్థానికులు తమ సందేహాలు, అభ్యంతరాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రాంతీయంగా మౌలిక సదుపాయాలు మెరుగుపడి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు పేర్కొన్నారు.

## తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా జాగృతి బీసీ విభాగం అధ్యక్షుడిగా కుమ్మరి శివశంకర్



**మొయినాబాద్ , విశాలభారతి:** తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా బీసీ విభాగం అధ్యక్షునిగా కుమ్మరి శివశంకర్ నియామకం. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ ఆదేశాలతో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి జాగృతి హోదాలో రంగారెడ్డి జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడినిగా మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామానికి చెందిన కుమ్మరి శివ కుమార్ ను నియమించారు. ఆయనను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ సామాజిక తెలంగాణ లక్ష్యంగా బీసీ వర్గాల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ జాగృతి ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. నాడు ఉద్యమ సమయంలోనే కాకుండా, నేడు సామాజిక మార్పు కోసం కవిత నాయకత్వంలో బీసీ విభాగం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కొత్తగా నియామకమైన అధ్యక్షుడు జిల్లావ్యాప్తంగా ఉన్న బీసీ యువతను, సామాజిక శ్రేయోభిలాషులను ఏకం చేస్తూ జాగృతి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కుమ్మరి శివశంకర్ నియామకం పట్ల జిల్లాలోని తెలంగాణ జాగృతి నాయకులు మరియు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. కవిత ఆశయాలకు అనుగుణంగా, అణగారిన వర్గాల గొంతుకగా ఈ విభాగం పనిచేస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు ఉంటాయని జాగృతి పార్టీ అభివృద్ధి కోసం తన సాయి శక్తుల కృషి చేస్తానే చెప్పారు. తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతను అప్పజెప్పిన జాగృతి వ్యవస్థకు తాను రుణపడి ఉంటానని తెలిపారు. మొయినాబాద్ మున్సిపల్ అభివృద్ధికి జాగృతి ఆధ్వర్యంలో తాను నిరంతరం కష్టపడి పని చేస్తానని చెప్పారు.

## రెండు రోజుల్లో బాలికను రక్షించిన పోలీసులు

**ఒక మైనర్ సహా ఇద్దరు అరెస్ట్**

**రాజేంద్రనగర్, విశాలభారతి :** తప్పిపోయిన 16 ఏళ్ల బాలికను రక్షించిన పోలీసులు – ఇద్దరు నిందితుల అరెస్ట్ సైబరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయిన 16 ఏళ్ల బాలికను పోలీసులు విజయవంతంగా గుర్తించి రక్షించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఫిబ్రవరి 16, 2026న బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం ఫిబ్రవరి 18, 2026న నార్సింగి పోలీస్ స్టేషన్ సిబ్బంది బాలికను గుర్తించి సురక్షితంగా రక్షించారు. దర్యాప్తులో బాలిక ఆన్‌లైన్‌లో పరిచయమైన ఒక మైనర్ బాలుడి ద్వారా ఆకర్షించబడినట్లు తేలింది. ఆ తర్వాత అతడు మరియు అతని ఇద్దరు సహచరులు కలిసి బాలికను అపహరించి, బెదిరింపులకు గురిచేసి దాడి చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఒకరు మైనర్ కావడంతో జువెనైల్ చట్టాల ప్రకారం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మూడవ నిందితుడు పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. బాలికను వైద్య పరీక్షల కోసం తరలించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ పరిచయాల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.




## ఆదర్శ రైతు యారం లక్ష్మిరెడ్డి పంటలను సందర్శించిన కలెక్టర్

- కలెక్టర్‌కు స్వాగతం పలికిన మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి
- ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు పెరగాలి ఎమ్మెల్యే పాయం
- ఆదర్శ రైతు దంపతులను సన్మానించిన కలెక్టర్
- ఆర్గానిక్ పంటలు అద్భుతం ఏడిఏ తాతారావు





**బూర్గంపాడు,విశాలభారతి:**

బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామ ఆదర్శ రైతు యారం లక్ష్మిరెడ్డి, మేడిపల్లిఉదయ్, పోతిరెడ్డి వెంకట్రాంరెడ్డి పంటలను గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ జితేష్ వి పటేల్ సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచన మేరకు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాజీ ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో ఆర్గానిక్ మిర్చిని మంగళవారం నాడు కలెక్టర్ కు అందజేయగా అట్టి మిర్చి నాణ్యతను పరిశీలించిన కలెక్టర్ ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులను రైతులకు తెలియజేయుటకు నేడు శ్రీకారం చుట్టారు. ఆర్గానిక్ పంటల సాగు పినపాక నియోజకవర్గ వ్యాప్తంగా విస్తరించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పలు సందర్భాల్లో రైతులతో ముచ్చటించినట్టు పోతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్గానిక్ వినియోగం వల్ల ఆరోగ్యంతో కూడిన ఆదాయం లభిస్తుందని అన్నారు. అదేవిధంగా రైతులు ఒక్క పంట మీదే ఆధారపడకుండా వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పామ్ ఆయిల్, తేనెటీగల పెంపకం, చేపల పెంపకం వంటి మొదలగు అదనపు ఆదాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఆర్గానిక్ పంటలకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి ధర లభిస్తుందని అన్నారు. రైతులు ప్రాణాంతకమైన రసాయన ఎరువులను వీడి, సేంద్రీయ ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించాలని రైతులను ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ లక్ష్మీపురం, ఆదర్శ రైతు యారం లక్ష్మిరెడ్డి దంపతులు, మేడిపల్లి ఉదయ్, ఎంపీడీవో జములారెడ్డి, తాసిల్దార్ ప్రసాద్, అగ్రికల్చర్ అధికారి ఏడీఏ తాతారావు, ఇంటెలిజెన్స్ అధికారి అంజిబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాదం రమేష్ రెడ్డి తదితర రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**రాజన్న సిరిసిల్ల , విశాలభారతి:** వేములవాడ పట్టణంలో నాలుగు రోజులుగా నిర్వహించిన 8వ తెలంగాణ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటలలో గెలుపు, ఓటములు సహజమని, గెలిచిన వారు, ఓడిన వారు రెండూ సమానంగా స్వీకరించాలని అన్నారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని, జీవితంలో వచ్చే ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కోవడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో బాలుర విభాగంలో ఖమ్మం జిల్లా మొదటి స్థానం, రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానం, వరంగల్ జిల్లా మూడవ స్థానం, ఆదిలాబాద్ జిల్లా నాలుగవ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో మహబూబ్నగర్ జిల్లా మొదటి స్థానం, వరంగల్ జిల్లా ద్వితీయ స్థానం, నల్లగొండ జిల్లా మూడవ స్థానం, హైదరాబాద్ జిల్లా నాలుగవ స్థానం దక్కించుకున్నాయి. రాష్ట్ర స్థాయి పోటీలను వేములవాడలో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గతంలో స్థానిక సంస్థల ప్రతినిధిగా, ఆలయ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో కూడా వాలీబాల్ పోటీలను నిర్వహించినట్లు గుర్తు చేశారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే కృషి చేస్తున్న కోచ్‌లను అభినందించారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడం ద్వారా స్నేహభావం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. సీఎం కప్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పోటీలను నిర్వహిస్తూ 45కు పైగా క్రీడలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. అంతర్జాతీయ ఫుట్ బాల్ క్రీడాకారుడు లియోనెల్ మెస్సిను హైదరాబాద్‌కు ఆహ్వానించి స్వయంగా ఫుట్ బాల్ ఆడడం ద్వారా క్రీడల పట్ల ఉన్న మక్కువను ముఖ్యమంత్రి చూపించినట్లు పేర్కొన్నారు. తెలంగాణను గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని అన్నారు. వేములవాడ ప్రాంతంలో క్రీడాకారుల కోసం 5 ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. గతంలో ఆగిపోయిన స్టేడియం నిర్మాణం త్వరలో పూర్తి అవుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాష్ట్ర మరియు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. విజయం సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి



**మణుగూరు, విశాలభారతి :**

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి ఈఎస్ఐ వైద్య సౌకర్యం అమలు చేయాలనీ సీఎం పిఎఫ్ వివరాలు అందజేయాలనీ కోరుతూ ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఏరియా డిజిఎం సివిల్ గరిమెళ్ళ శివ ప్రసాద్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్ డి నా సర్ పాషా మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాల సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఈఎస్ఐ వైద్య సౌకర్యం అమలు కొరకు మణుగూరులో కూడా సంబంధిత కార్యాచరణ రూపొందించారనీ కానీ ఇప్పటివరకు పథకం అమలు కాలేదన్నారు దీంతో కాంటాక్ట్ కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యులు వైద్య సౌకర్యం కొరకు ప్రైవేటు ఆసుపత్రుల లో వైద్యం కొరకు స్తోమతను మించి ప్రైవేటు వైద్యశాలలో ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు దయచేసి వీలైనంత త్వరగా మణుగూరు ఏరియా అన్ని విభాగాల కాంటాక్ట్ కార్మికులకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఈఎస్ఐ వైద్య సౌకర్యం అమలయ్యేలా చూడాలని కోరారు ఈ సంవత్సరం మార్చి నెలాఖరు వరకు పిఎఫ్ లెక్కల పాస్ జమ వివరాలతో కూడిన బుక్కులు సత్వరమే అందజేయాలనీ అదేవిధంగా అన్ని విభాగల కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతినెల ఏడవ తేదీ కల్లా వేతనాలు చెల్లించాలనీ చెల్లించని కాంట్రాక్టర్ల పై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్, కాంట్రాక్ట్ కార్మికులు కే వెంకట నారాయణ, కే వీర్రాజు, ఏం భావ్ సింగ్, కే గురుమూర్తి, వెంకటనారాయణ కే నాగేశ్వరరావు,ఎం సాంబ, గుర్రాల శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, ఎన్ రాజేష్, జి వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, సాయి, ఎస్.కె రజబ్ అలీ, టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య



**మెదక్ , విశాలభారతి::** మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని చిన్న శివునూరు గ్రామంలో మనస్థాపంతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొటారి స్వామి (30), వృత్తి బైకు మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. వివాహం జరగకపోవడం మరియు కుటుంబానికి సంబంధించిన భూమి మార్పిడి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కొంతకాలంగా మనస్తాపంతో ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో నిన్న రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వామి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానికులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గిరిజన క్రీడా పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాధికారి విజయ



**మెదక్ , విశాలభారతి:** మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర క్రీడ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కును కృపాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నాగరాజు, పెంటగౌడ్, మహేందర్ రెడ్డి పదవ తరగతి విద్యార్థుల ఇంటర్ మార్కులు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో జిల్లా విద్యాధికారి విజయ, మండల విద్యాధికారి నీరజ తో కలిసి పాఠశాలలో జరుగుతున్న ఇంటర్నల్ మార్క్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు మార్చి 14 నుండి ప్రారంభం కానందున, అన్ని సబ్జెక్టుల 20 మార్కులకు సంబంధించిన ఇంటర్నల్ మార్కు లిస్ట్ ను తనిఖీ చేయడం జరుగుతుందని వారన్నారు.

## శివాజీ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

**ఎమ్మెల్యే**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మైలార్దేవరపల్లి డివిజన్‌లోని శివాజీ మహారాజ్ విగ్రహానికి, అలాగే బృందావన్ కాలనీలో ఉన్న శివాజీ విగ్రహానికి ఎమ్మెల్యే గారు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే , బానిసత్వంలో ఉన్న ప్రజల్లో ఆత్మగౌరవాన్ని నింపి “మన రాజ్యం” అనే భావనను కలిగించిన మహానుభావుడు శివాజీ మహారాజ్ అని కొనియాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆయన పరిపాలన సాగిందని పేర్కొన్నారు. శత్రువుల ఇంటి మహిళలను సైతం తల్లులుగా గౌరవించిన గొప్ప సంస్కారం ఆయనదని, నేటి సమాజానికి ఆ క్రమశిక్షణ ఎంతో అవసరమని అన్నారు. ఎంత పెద్ద కష్టమైనా, ఎంత శక్తివంతమైన శత్రువైనా యుక్తి, ధైర్యంతో ఎదుర్కోవచ్చని శివాజీ మహారాజ్ తన జీవితంతో నిరూపించారని తెలిపారు. శివాజీ మహారాజ్ కేవలం ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితం కాదని, ఆయన యావత్ భారత దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని కులమతాలకు అతీతంగా సమాజ అభివృద్ధి కోసం అందరం కృషి చేయాలని ఎమ్మెల్యే గారు పిలుపునిచ్చారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి



**శంషాబాద్ , విశాలభారతి:** అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడేషన్ కార్డులు అందజేయాలని లోకల్ గైడ్ దినపత్రిక ఎడిటర్, తెలంగాణ స్టేట్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చిలకమ్మరి రామిరెడ్డి కోరారు. ఈమెకు గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నో ఏళ్లుగా వివిధ దినపత్రికల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడేషన్ ఇవ్వడంతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలను అందజేయాలని కోరారు. అదేవిధంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కలెక్టర్ కు విన్నవించారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు రామ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకల్ గైడ్ దినపత్రిక రంగారెడ్డి జిల్లా బ్యూరో పి వెంకటేష్ ఇతర జర్నలిస్టులు పాల్గొన్నారు.



# అది వృత్తికే ద్రోహం

'నటిగా నేను ఈ స్థాయిలో ఉన్నానంటే.. దానికి ప్రధాన కారణం నా అందమైన శరీరం. ఏ పాత్రనైనా అర్థం చేసుకొని ముందుకెళ్లే క్రమంలో నాకు సర్వవిధాలా సహకరించింది నా శరీరం. అందుకే దాని విలువ వెలకట్టలేనిది. ఒక్క సినిమా కోసం దాన్ని పాడుచేసుకోవడం నా వృత్తికే ద్రోహం చేసినట్టు లెక్క' అంటున్నది బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా. ఆమె నటించిన హాలీవుడ్ చిత్రం 'ది బ్లఫ్' ఈ నెల 25న అమెజాన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఆ సినిమా గురించి చెబుతూ పై విధంగా స్పందించింది ప్రియాంక చోప్రా. ' 'ది బ్లఫ్' నేను కష్టపడి నటించిన సినిమా. ఇందులో నాలుగు ప్రమాదకరమైన స్టంట్స్ ఉన్నాయి. ముఖంపై గాజు పెంకులు గుచ్చుకునేంత రిస్కీ ఫైట్స్ అవి. అందుకే దర్శకుడు ఫ్రాంకీ నన్ను ఆ స్టంట్స్ చేయనివ్వలేదు. నిజానికి నేను కూడా ఆసక్తి చూపలేదు. డూప్‌తో చేయించేశారు. ఒకవేళ నేను చేసుంటే.. నేను చేస్తున్న ప్రస్తుత సినిమాల విషయంలో ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సివచ్చేది.' అంటూ చెప్పుకొచ్చింది ప్రియాంక. ప్రస్తుతం ఈ అందాలభామ ఎస్.ఎస్.రాజమౌళి, మహేశ్‌బాబు కాంబినేషన్లో రూపొందుతున్న పాన్ వరల్డ్ మూవీ 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా మందాకినీ అనే పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.